హనీబీఏపి

సంపుటి 2, సంచిక 1

మార్చి - ఏప్రిల్ 2012 వెల : ₹ 25/-

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




**ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్‌లో**

**మన రాష్ట్రానికి చెందిన జాతీయ బహుమతి గ్రహీతలు**

6వ జాతీయ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన అవార్డు ప్రదానోత్సవం  దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవనంలోని విశాల ఉద్యానవనంలో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ గారు ఈ అవార్డులను గ్రామీణ శాస్త్రవేత్తలకు అందజేశారు. తెలుగు గడ్డనుండి జాతీయ బహుమతి పొందిన శ్రీ బోయ రాజన్న (అనంతపురం), శ్రీ నజీర్ అహమ్మద్ (మహబూబ్‌నగర్), శ్రీ భూమయ్య చారి (నిజామాబాద్), పల్లెసృజన లతో కొన్ని మధుర క్షణాలు.






# పల్లెసృజన

సంపుటి-2 సంచిక - 1 మార్చి - ఏప్రిల్ 2012



## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగులగణేశం

సంపాదకులు :
జె. శశిమోహన్

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
పల్లె వీర రాఘవ రెడ్డి

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్ హైదరాబాద్.
ఫోన్ : 040- 32945655
సెల్ : 93913 75655, 800 888 5655
E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555, 98660 01678
E-mail : honeybeeap@gmail.com
www.pallesrujana.org


## ఈ సంచికలో...


- కష్టపడ్డవాళ్ళే నష్టపడాలా? - 3
- టి. భూమయ్య చారి ఢిల్లీ యాత్ర అనుభవాలు - 5
- గ్రామీణ పశువైద్యుడు బోయ పెద్ద రాజన్న - 7
- మ్యాజిక్ లాంతరు - 8
- 3వ చిన్న శోధయాత్ర - 9
- నూనెగింజలు పండించే రైతుల ఇన్నోవేషన్లు - 18
- చుక్క చుక్క నీరు - 22
- క్రీ.శ. 2070 నుండి 2012 భవిష్యత్తు నుండి వర్తమానానికి.... - 24
- ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు - 25
- హనీబీ ఎపి ప్రగతి - 29
- ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 30
- స్పందన - 32

**కవర్ లోపలి పేజీల్లో ....**

జాతీయ అవార్డుల ఉత్సవంలో
తెలుగువారి గుర్తింపు దృశ్యాలు

**మధ్య పేజీల్లో....**

ఢిల్లీలోని గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ & సాంప్రదాయ జ్ఞానం
అవార్డుల ఉత్సవంలో తెలుగు ఇన్నోవేటర్లకు వచ్చిన ప్రశంసా పత్రాలు



## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : **Brig. P. Ganesham,** 102, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 32945655

# పెంచిన అడవులు సహజ అడవులవుతాయా?

'మా అడవి మాకు ఇప్పించండి సార్ మాకు ఇంకేమీ వద్దు' అన్నారు రాఘవులు గారు, అచ్చంపేట మండలంలోని బిల్లేకల్ తాండాలో నివసిస్తున్న నలభై ఏళ్ళ ఆదివాసి. ఆదివాసులకు అడవి తల్లిలాంటిది. మన వ్యవస్థ వారిని అడవి నుండి దూరం చేసిందా? ఆదివాసులకై అమలు పరిచిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు వారిని తల్లిలాంటి అడవినుండి వేరు చేశాయా? అడవులు లేకుండానే అయ్యామా? ఈమధ్య బాక్సైట్ మైనింగ్ అనుమతివల్ల ఆదివాసులకు జరుగుతున్న అన్యాయం గురించి పత్రికల్లో వస్తున్న చర్చను మనం సీరియస్‌గా గమనించాలి. సహజ అడవులకు, పెంచిన అడవులకు చాలా తేడా ఉంటుంది. సహజ అడవుల్లో ఆదివాసులకు జంతువులకు, పక్షులకు జీవనాధారం లభిస్తుంది. సహజ అడవులను అభివృద్ధి కోసం నిర్మూలించి కొత్త అడవులను పెంచి, దాంతో దేశంలో అడవుల విస్తీర్ణం తగ్గలేదని సర్దుకోవడం సబబు కాదు. పెంచిన అడవుల్లో జీవనాధార వనరులు చాలా తక్కువగా ఉంటాయని మనకందరికీ తెలుసు.

రాములు, లక్ష్మి లంబాడీ దంపతులు. సూర్యవరం గ్రామవాసులు. ఎత్తుగా, అందంగా ఉంటారు. ఇద్దరికీ అరవై దాటింది. రివటలా చక్కగా నిలబడతారు. చురుకుగా పని చేస్తారు. వారికి ఎనిమిది మంది సంతానం. "అయ్యా నేనెప్పుడూ ప్రసూతికి దవఖానాకు పోలేదు. ఇప్పుడైతే మా కోడళ్ళందరూ ప్రసూతికై దవఖానాకే పోతారు" అని లక్ష్మి వాపోయింది. ఎందుకలా! అన్నదానికి జవాబుగా "మేం అంబలి, గటక, రాగులు, కొర్రలు తినేవాళ్ళం, మాకు మంచి శరీరం, శక్తి ఉండేది. ఇప్పుడు తినే బువ్వలో ఏముందయ్యా? ఈ కాలపు ఆడపిల్లలకు ఇంట్లో ప్రసవం అయ్యే శక్తి లేదు కదా! అందుకే అంతా దవాఖానకు వెళుతున్నారు, ఖర్చు పెరుగుతుంది. భోజనం మారేవరకు ప్రజల ఆరోగ్యం, వారి శక్తి తగ్గుతూనే ఉంటుంది." రాములు, లక్ష్మి ఆదర్శ దంపతులు. తరవాతి తరాన్ని సరియైన మార్గంలో నడిపించడానికి సహజ జీవనాన్ని గడపటానికి మార్గదర్శకత్వం చేస్తూవుంటారు. "నామీద గౌరవం ఉన్నా, సలహాలు అమలు చేయటం లేద"ని వాపోయాడు రాములు.

మూడవ చిన్న శోధయాత్ర ముచ్చటగా మూడు రోజులు మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట మండలంలో జరిగింది. కాలేజీ విద్యార్థులు 28 మంది పాల్గొన్నారు. గ్రామస్తులతో చర్చలు, వారినుండి జ్ఞానసేకరణ, స్కూలు విద్యార్థులతో ముచ్చట్లు, భోజనాలు, మార్గదర్శకాలు, యాత్రికుల శోధన జ్ఞానపంపిణీ, ముఖ్యంగా 39 కి.మీ. నడక జ్ఞానప్రదంగా జరిగింది. యాత్రలో పాల్గొన్న కాలేజీ విద్యార్థుల అనుభవాలను ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

మీ 'పల్లెసృజన' ఏడవ సంవత్సరంలో అడుగిడింది. ద్వైమాసిక పత్రికగా ఒక సంవత్సరం గడిచింది. మీ ఆదరణే మమ్మల్ని ముందుకు సాగిస్తున్నది. మరిన్ని పల్లె ఇన్నోవేషన్లలో సాంప్రదాయక జ్ఞానంతో పల్లె ప్రజల సహజ భావాలతో వచ్చే సంవత్సరం మీకు జ్ఞానపూరిత, అర్థపూరిత సహజ జీవన శైలితో పల్లెసృజన ఆరు సంచికలను మీముందుంచాలని మనసారా ఆశిస్తూ మీ ఆశీర్వాదాలను కోరుతూ.....

**భవదీయ**

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం



ప్రతినెల దూరదర్శన్, హైదరాబాద్ ప్రతినెల 4వ గురువారం రాత్రి 8 గంటలకు సప్తగిరి ఛానల్ లో 'సృజన' కార్యక్రమం ద్వారా గ్రామీణ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారు. పాఠకులంతా ఈ కార్యక్రమాన్ని తప్పకుండా చూసి మీ అభిప్రాయాలను మాకు తెలియజేయగలరు.




ఆహార ధాన్యాలు దిగుమతితో ఆహార కొరతని తీర్చలేము అన్నది అందరూ అంగీకరించే విషయమే. ఆధునిక సాంకేతిక విజ్ఞానం పంటల అభివృద్ధికి ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నా అవన్నీ సాధారణ చిన్న రైతులకి చెప్పుకోదగ్గ స్థాయిలో సహాయ పడటం లేదని చెబుతున్నారు రాజస్థాన్‌కు చెందిన చురు జిల్లా రైతు మహావీర్ సింగ్ ఆర్యా.

తీవ్రమైన నీటి కొరత ఉన్నప్పటికీ సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని నమ్మి ఎన్నో రకాల గోధుమలు, ఆవాలు రూపొందించి ఆయన ఇప్పుడు రసాయన ఎరువులు వాడకుండానే మంచి పంటలు పండిస్తున్నాను అంటున్నారు.

పట్టణ వాసులకి మా రైతులు పడే బాధలు తెలియవు. వాళ్ళకీ విషయం కేవలం ధరలు పెరిగినప్పుడు మాత్రమే గుర్తుకు వస్తుంది అని చెపుతూ ఆయన వ్యవసాయం ఎంతో అనిశ్చితమైన, ఎన్నో కష్టనష్టాలతో కూడుకున్న పని. కాని పట్టణవాసుల్లో చాలామంది ఇది ప్రభుత్వ వ్యవహారమనీ, ప్రజాప్రతినిధులు తీర్చవలసిన సమస్య అని భావిస్తారు.

దేశంలో మన అవసరాలకిగాను ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవడం, భారీ సంఖ్యలో పల్లెలనుంచి జనాలు పట్టణాలకు వలస పోవటం లాంటివి పట్టణ వాసులకి పెద్ద సమస్యగా అనిపించవు అన్నారాయన.

పట్టణవాసులు సాధారణ, సాదా సీదా పల్లె జీవితం గురించి ఎంతో మక్కువపడినా పల్లెల్లో జీవించడం అన్నది అంత తేలికైనది కాదు అంటారాయన.

పల్లెవాసులు చుట్టుప్రక్కల పట్టణాల్లో మంచి భవిష్యత్తు వెతుక్కుంటూ వెళ్ళిపోయి తమ పిల్లలకి మంచి చదువు సంధ్యలు చెప్పించి వారిని పల్లెలనుంచి తరిమేయాలని చూస్తున్నారు. పర్యవసానంగా తగినన్ని ఆహార ధాన్యాలు అందుబాటులో లేకపోవటము, అవసరాలు మాత్రం పెరిగిపోవటం జరుగుతోంది. మనమంతా ఎప్పుడైనా పేలిపోయే అగ్నిపర్వతంపై కూర్చొని వున్నాం అన్నారు ఆయన.

రైతు జీవితం అన్నది ఆయన తన జీవనోపాధికై నిరంతరం ఏవేవో ప్రయోగాలు చేస్తూండటంతోనే సరిపోతుంది. మేం పండించిన పంటలకి మంచి ధర

సంపాదించడం కష్టతరమైతోపోందని వాపోయారాయన.

ఎన్నో ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ తాను స్వంత జిజ్ఞాసతోటి, వేర్వేరు రకాల పంటలను ఏ విధంగా పండించాలో తెలుసుకోవటం కోసం 'హిస్సార్' వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని సందర్శించానని, అక్కడ వేర్వేరు రకాల పంటలతో ఏ విధంగా సంపర్కం కలిగించవచ్చునో తెలుసుకున్నానని చెప్పారు. తిరిగి వచ్చి తన పొలంలో ప్రయోగాలు చేయటం ప్రారంభించాడు. సాధించిన ఫలితాలతో ఉత్సాహం పొంది వివిధ పరిశోధనా సంస్థలు, విశ్వ విద్యాలయాలు సందర్శించారు. అక్కడ తన జ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు.

ఢిల్లీ చుట్టుప్రక్కల దొరికే ఆవాల ఆధారంగా పరపరాగ సంపర్కం చేసి తాను స్వంతంగా పది కొత్తరకం ఆవాలను రూపొందించాడు. ఇవన్నీ కూడా 130 నుండి 150 రోజులలోపల కాపుకు వస్తాయి. హెక్టారుకి 1.8 నుండి 2.4 టన్నుల వరకు దిగుబడినిస్తాయి. ఆయన చెప్పినదాని ప్రకారం ఈ రకాలన్నీ కూడా రోగనిరోధక శక్తి ఎక్కువగా కలిగివున్నవే.

ఆయన ప్రత్యేకంగా అధిక దిగుబడినిచ్చే గోధుమలను తీసుకొని వాటితో స్థానిక గోధుమ రకాలతో సంపర్కం చేవాడు. ఫలితంగా ఆ సంవత్సరం గోధుమ పంట ఎత్తుగా, ఏపుగా పెరిగి గోధుమలు పొడవుగా వుండి రోగ నిరోధక శక్తిని కలిగి వుండటం గమనించాడు. దాంతో ఆయన ఏపుగా పొడవుగా పెరిగి రోగ నిరోధక శక్తి కలిగిన గోధుమలు వెతికి సేకరించి, ప్రయోగాలు చేసి 'మహావీర్ కిసాన్ మహాన్' అనే కొత్తరకం గోధుమను రూపొందించాడు.

అదేవిధంగా వివిధ ప్రాంతాలనుండి సేకరించి తెచ్చిన గోధుమ రకాలతో స్థానికంగా దొరికే గోధుమ రకంతో సంపర్కం చేసి, 15 కొత్తరకాల గోధుమలను రూపొందించాడు.

ఈ రకాలన్నీ 135 నుండి 160 రోజుల్లో కాపుకు వస్తాయి. ఆయనే రూపొందించిన పొట్టిరకం విత్తనం మహావీర్ కిసాన్ ప్రగతి రకం మాత్రం 95 నుండి 115 రోజుల్లో కాపుకు వస్తుంది. ఇవన్నీ కూడా హెక్టారుకి 4 నుండి 8 టన్నుల దిగుబడినిస్తాయి. ప్రతి రైతు తన పొలంలో ప్రతి అంగుళం వృధా చేయకుండా వినియోగించుకొని తద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చు అంటాడాయన.

రాజస్థాన్ ప్రాంతంలో హనీబీ కొలాబరేటర్, స్వంతంగా అభ్యుదయ రైతు అయిన సుందరం వర్మ మా ప్రాంతంలో తీవ్రమైన నీటికొరత ఉంది, సాధారణ దిగుబడి సాధించాలన్నా ఎంతో శ్రమించాల్సి వస్తోంది. దేశంలో కొన్ని కోట్ల మంది ఆకలి తీర్చటానికి పాటు పడుతున్న మహావీర్ లాంటి రైతుల గురించి లోకం కొంత పట్టించుకోవాలి అంటాడు.

మహావీర్ మాత్రం ప్రభుత్వం తన పరిధిలో చేతనైనంత చేస్తూ ఉండవచ్చు కానీ, ఇంకొంచెం చేస్తే మాలాంటి రైతులు దేశాన్ని ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి సాధించటంలో ఎంతో దోహదపడుతుంది అన్నారు.

ఇంకా వివరాలు కావాలంటే సంప్రదించవలసిన చిరునామా :

మహావీర్‌సింగ్ ఆర్యా, గుధన్ గ్రామం, రాజ్‌ఘడ్ తాలూకా, చురు జిల్లా, రాజస్థాన్. సెల్ : 094619 32854

## దూరదర్శన్ 'సృజన'

**దూరదర్శన్, హైదరాబాద్ లో**
**ప్రతినెల 4వ గురువారం రాత్రి 8 గంటలకు**
**సప్తగిరి ఛానల్ లో 'సృజన'**
**కార్యక్రమం ద్వారా గ్రామీణ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారు.**
**పాఠకులంతా ఈ కార్యక్రమాన్ని తప్పకుండా చూసి**
**మీ అభిప్రాయాలను మాకు తెలియజేయగలరు.** *- ఎడిటర్*




# జాతీయ బహుమతి గ్రహీత

# టి. భూమయ్య చారి ఢిల్లీ యాత్ర అనుభవాలు

**నిజామాబాద్ వాసి, ఇన్నోవేటర్ టి. భూమయ్య చారి రాష్ట్రపతి అవార్డు అందుకున్న సందర్భంగా ఢిల్లీ అనుభవాలను అతని మాటల్లోనే వివరిస్తున్నాము. - ఎడిటర్**

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2012 మార్చి, 9 నుండి 15వ తేది వరకు "ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్" ఏర్పాటు చేయబడిందని, మీరు ఢిల్లీ రావలసి ఉంటుందని బ్రిగేడియర్ గణేశం గారు ఫోన్ చేశారు. నాకు నోట మాటరాలేదు. కొన్ని క్షణాల తర్వాత తేరుకుని సార్‌కు కృతజ్ఞతలు తెలియజేశాను. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పగా అందరూ సంతోషించారు.

ట్రైన్‌లో ఎ.సి. టికెట్ బుక్ చేసి ఇచ్చారు గణేశం గారు. నాకు తోడుగా మా చిన్న అబ్బాయి సందీప్ కుమార్‌ను వెంట తీసుకొని మార్చి 7న ఢిల్లీకి బయలుదేరాను. 8వ తేది ఉదయం 10 గంటల ప్రాంతంలో డా. వివేక్ కుమార్ గారు మమ్మల్ని ఆత్మీయంగా ఆహ్వానించారు. ఇన్నోవేటర్లకు అందరికి ఒక మంచి హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. స్నానాది కార్యక్రమాలు ముగించుకున్న తర్వాత మిత్రులు చింతకింది మల్లేశం, అతని తమ్ముడు నరేంద్ర, పెద్ద రాజన్నగారు, పరశురాం గారు తదితరులము కలిసి మధ్యాహ్న భోజనం చేశాము. తదనంతరం రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నాము. అక్కడ ఎవరికి కేటాయించిన స్టాల్‌లో వారు తమతమ ఇన్నోవేషన్లను ప్రదర్శించటానికి ఏర్పాటు చేసుకున్నాము.

ఈ ప్రదర్శనలో మన రాష్ట్రం నుండి నలుగురం రాష్ట్రపతి పురస్కారాలను అందుకున్నాము. 'పల్లెసృజన'కు ఉత్తమ అవార్డు రాగా దాన్ని గణేశం గారు స్వీకరించారు. నాకు, నజీర్ అహమ్మద్ గారికి, బోయ పెద్దరాజన్న గారికి 'ఉత్తమ ఐడియా' అవార్డు అందజేశారు. ఇది జీవితంలో మరిచిపోలేని తీపి జ్ఞాపకం.

మార్చి 9వ తేదీ భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ గారి సన్నిధిలో క్రమశి క్షణతో నిలబడి మన జాతీయ గీతం 'జనగణమన' గీతాలాపన లయబద్ధంగా వినిపిస్తుంటే ఆ దృశ్యం చాలా మనోహరంగా అనిపించింది. ఆ గీతాన్ని కళ్ళు మూసుకుని మదిలో ఆలపించడం నా జీవితంలో



మరచిపోలేని సంఘటనలలో ఒకటి. ఇది నా భాగ్యంగా భావిస్తున్నాను. ఈ భాగ్యాన్ని నాకు కలుగజేసిన అందరికీ సదా ఋణపడి వుంటాను.


రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఇన్నోవేషన్ పోటీలకు భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుండి కలిపి 7 కేటగిరీలలోని ఐడియాలు, ఇన్నోవేషన్లు, నమూనాలు మొత్తం కలిపి 38,634 ఎంట్రీలు వచ్చాయి. ఇందులో నుండి ఉత్తమమైనవి 46 ఎంపిక చేసి, రాష్ట్రపతి పురస్కారాలను అందజేయటం జరిగింది. ఇందులో భాగంగా నా ఇన్నోవేషన్ 'ప్రత్యేకమైన రెక్కలతో తయారైన విండ్‌మిల్' కు 'నేషనల్ ఐడియా అవార్డ్' లభించింది. ప్రశంసా పత్రంతో పాటు రూ. 25,000/-ల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఎగ్జిబిషన్‌లో నేను రూపొందించిన విండ్‌మిల్‌ను చూసి చాలామంది చేతులు కలిపి చాలా మంచి ఆలోచన అని నన్ను ప్రశంసించారు. వారం రోజులపాటు సందడిగా జరిగిపోయింది. ప్రతిరోజూ ఇన్నోవేటర్లందరినీ మా బసనుండి రాష్ట్రపతి భవన్‌కు తీసుకువెళ్ళటానికి రెండు బస్సులు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9 గంటలకు మయలుదేరి 10 గంటలకల్లా రాష్ట్రపతి భవన్ చేరుకునేవాళ్ళం. అక్కడే ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులో అల్పాహారం అయిన తర్వాత ఎగ్జిబిషన్ హాల్ చేరుకొని ఎవరి స్టాల్‌లో వాళ్ళం కూర్చునేవాళ్ళం. ఇన్నోవేషన్లను చూడటానికి వచ్చిన సందర్శకులకి నేను హిందీలోనే వివరించి సమాధానాలు చెప్పేవాడిని. మా అబ్బాయి సందీప్ కుమార్ అవసరమైన వారికి ఆంగ్లంలో చెప్పేవాడు. మీ విండ్ మిల్‌కి సామర్థ్యత ఎక్కువగా ఉంది, దీనితో కరెంటు జనరేట్ చేయటానికి మార్కెట్‌లోకి తీసుకు రమ్మని కొంతమంది సందర్శకులు సలహా ఇచ్చారు. మధ్యాహ్నం 1 నుండి 2 గంటల వరకు అక్కడి ఫుడ్ కోర్టులోనే భోజనాలు ఏర్పాటు చేశారు. చుట్టూ ఎత్తయిన పచ్చని చెట్లు, రకరకాల పూల మొక్కలు, చల్లని గాలి, మెత్తని పచ్చగడ్డిలో అన్ని రాష్ట్రాలనుండి వచ్చిన ఇన్నోవేటర్లందరూ ఒక గుంపుగా కూర్చొని భోజనం చేస్తూ కబుర్లు చెప్పుకునేవాళ్లం. సాయంకాలం 4 గంటలకి కాఫీ టిఫిన్లు చేసి, సాయంత్రం 5 గంటల వరకు ఎగ్జిబిషన్‌లో ఉండి ఆ తర్వాత బయలుదేరి తిరిగి బసకి చేరుకునేవారం.

అక్కడున్న వారం రోజులూ దాదాపు రోజూ ఇదే మా దినచర్య. 11మార్చి, 2012 నాడు ఇన్నోవేటర్లందరినీ సమావేశపరిచి ఇన్నోవేటర్ల సాధక బాధకాలను శ్రీ అనిల్ గుప్త గారు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఇన్నోవేటర్లందరికీ మౌళిక సమస్య ఒకటే అనిపించింది. ప్రతి ఇన్నోవేటర్ తన ఐడియాను క్షేత్రస్థాయికి తీసుకు రావటానికి వర్క్‌షాప్ కావాలి, ఇంజనీరు, వెల్డరు, టర్నరు, ఫిట్టర్ల యొక్క సహాయ సహకారం కావాలని దాదాపు అందరూ తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ప్రొ. గుప్తా గారు మీ సమస్య అర్థమైంది, దీన్ని పరిష్కారం ఆలోచిస్తామని హామీ ఇచ్చారు.

అక్కడ సమావేశమైన అందరి అభిప్రాయాలూ ఒక్కటే. అందరికీ తాము చేసిన ఇన్వెన్షన్స్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించాలని, అందరి మనసుల్లో పశువులకు, పంటలకు సహాయపడాలనే ఆరాటము, తపన.

ఆలోచనలని సాగదీస్తే ఎవరైనా ఐన్‌స్టీన్‌ని మించవచ్చు.


**భూమయ్యచారి సెల్ నెం : 97042 25105**



### స్వంత పనులను కూడా వదులుకొని పశువులకు సేవ చేసే

## గ్రామీణ పశువైద్యుడు

# బోయ పెద్ద రాజన్న




అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం 'గోళ్ళ' గ్రామంలో నివసించే బోయ పెద్ద రాజన్న ఆ పరిసర ప్రాంతాల్లో పశు వైద్య రంగంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వ్యక్తి. ఈయనకీవిద్య ఈయన తాతగారి కాలం నుండి అబ్బింది. తండ్రి బోయ మాదప్పకి పెద్ద కుమారుడిగా జన్మించిన రాజన్న తన తాత, తండ్రులు, చుట్టుప్రక్కల గ్రామాల్లోని పశువులకు వైద్యం చేస్తూవుండగా చూసి, తెలుసుకొని నేర్చుకున్న విద్య ఇది. రాజన్నకి, తన భార్య లక్ష్మక్కకి అక్కమ్మ, వరలక్ష్మి, ఓబులమ్మ అనే ముచ్చటైన ముగ్గురు కూతుళ్ళున్నారు.

ఆయన తన వైద్య విధానం గురించి చెపుతూ మా తాతగారి కాలం నుండి పశువులకి వైద్యం చేస్తున్నామని, మా ఊరే కాక, మా మండలంలోని చాలా ఊళ్ళల్లోని పశువులకి వైద్యానికై రైతులు తనవద్దకే వస్తారని, ఆ పశువులకి మేలైన వైద్యం అందించటమే తనకి ఆనంద దాయకమని చెప్తాడు. తన వైద్యం బాగా పనిచేస్తుందని, అందుకే తనపై నమ్మకంతో ఎంతోమంది వస్తారని, దాని కారణంగా తనకి ఒక్క క్షణం తీరిక ఉండదని, చాలాసార్లు తన ఇంటి పనులు, పొలం పనులు కూడా వదులుకొని వైద్యం చేయటానికి పొరుగూళ్ళకి వెళ్ళి వస్తూవుంటానని అంటారు రాజన్న. తానూ రైతునేనని, తనకీ పొలం, పశువులు ఉన్నాయని చెప్పారు. తాను తోటి రైతులకు చేసిన సహాయానికి మంచిపేరు సంపాదించుకున్నానని, రైతులు తనవద్దకు వచ్చి కేవలం పశువుల రోగ లక్షణాలు చెప్తే చాలు వైద్యం అందించగలనని చెప్పారు.

అదేవిధంగా ఎవరైనా పశువుల కొనుగోలుకు వెళ్ళేముందు తనవద్దకు వచ్చి సలహాలు తీసుకు వెళ్తారని చెప్పారు. రైతులు తనవద్దకు వచ్చి పశువులకు గల రోగాలు మరియు వాటికి మంచి మేలు చేసే పద్ధతుల గురించి తనను అడిగి వాటికి అవసరమైన మూలికలు తీసుకొని వెళ్తారు అని చెప్పారు. రైతులు తనవద్దకు వచ్చినప్పుడు తాను పొలం పనులు, పశువులను కూడా వదిలేసి వెళ్ళి ఆ పశువులకు రోగాన్ని బట్టి తగినఆకులు, మూలికలతో వైద్యం చేస్తానని అన్నారు. సాధారణంగా రెండు మూడు రోజుల్లో తన వైద్యం ఫలితంగా పశువులకు నయమౌతుందని, తాను ఈ పనిని ఏ లాభం ఆశించకుండా చేస్తానని చెప్పారు. అందుకే తనకా పరిసర ప్రాంతాల్లో మంచి పశువైద్యునిగా పేరు వచ్చిందని చెప్పారు. తన తాతగారి కాలం నుండి ఆచరణలో వున్న వైద్య విధానమే తానూ అమలు చేస్తూ వుండటం వలన మంచి ఫలితాలు వస్తున్నాయని, తాను ఎటువంటి రకమైన పశువుకైనా వైద్యం సులువుగా చేయగలనని అంటారు రాజన్న.తనవద్దకు సాధారణంగా ఈ క్రింది సమస్యలతో పశువులను తీసుకు వస్తారని చెప్పారు.

1. కుంటి కుంది, 2. చలికుంది, 3. రక్తకుంది, 4. ఊదుకుంది, 5. పసల ఆప్తి, 6. కట్టరోగము, 7. పొదుగు వాపులు, 8. పారుకొనటము, 9. కాలికుంటు వ్యాధి, 10. కంటిచూపు పోయిన పశువులు, 11. వీపు వ్యాధి, 12. కడుపునొప్పి, 12. మూత్రంలో రక్తం పోవటం, 13. పాలల్లో రక్తం పోవటం, 14. పాలు లేని పశువులకు పాలు వచ్చేలా చేయటం మొదలైనవి.

పైన చెప్పిన వ్యాధులకి తాను గత 30 సంవత్సరాల నుంచి నాటువైద్యం చేస్తున్నానని, తనకు తెలిసిన మూలికలు, ఆకుల సహాయంతో పశువులలో ఎంత మొండి రోగానికైనా వైద్యం చేయగలనని పశువైద్యులకు కూడా లొంగని రోగాలు తాను నయం చేయగలనని చెపుతూ పశు వైద్యులు కూడా తన సలహా తీసుకోవటానికి వస్తారని గర్వంగా చెప్పారు. రాజన్న మేకలు, గొర్రెలు, మరియు ఇతర జంతువులకు కూడా వైద్యం చేస్తాడు.



## కాశ్మీర్‌లోని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రశాంతతనిచ్చే

# మ్యాజిక్ లాంతరు

కాశ్మీర్ ప్రాంతంలోని గులాం మహమ్మద్ మీర్ తయారు చేసిన ఈ లాంతరు వెలుతురునివ్వటంతో పాటు సంగీతం వినిపిస్తుంది, దుండగులు వస్తే తెలియజేస్తుంది.

మీర్ మహమ్మద్‌కి ఈ ఆలోచన కాశ్మీర్‌లో సాధారణంగా జరిగే అర్థరాత్రి అరెస్టులు, భయానక పరిస్థితులవల్ల వచ్చిందట. అప్పుడున్న పరిస్థితులను అధిగమించటానికి పట్టువదలకుండా ప్రయత్నం చేసి, సఫలీకృతుడు అయ్యాడు. చిన్నపాటి రైతు అయిన మీర్ ఎప్పుడూ బడి మొహం చూడలేదు. అలా అని ఏ ఇన్నోవేషన్ తరగతులకీ వెళ్ళలేదు.

ఈయన తయారు చేసిన లాంతరు వెలుగును ఇవ్వటమే కాకుండా, సంగీతం వినిపిస్తుంది, ఎవరైనా కొత్తవారు వస్తే మిమ్మల్ని హెచ్చరిస్తుంది. ఎన్నో విషయాలు గుర్తుంచుకొని మీకు బయటి ప్రపంచంతో సంబంధం కల్పిస్తుంది. ఈయన రూపొందించిన ఈ కొత్తరకం లాంతరుకి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ఇంకొక 20 నమూనాలు తయరు చేయటానికి ఆర్థిక సహాయం అందజేవారు. అవి ఆయన సమయానికి అందించగలిగితే మరో 200 ఇటువంటి లాంతర్లకే ఆర్డరు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారు.

ఇప్పుడు మీర్‌కి ఇంత పేరు రావటానికి వెనక అతను పడ్డ బాధ వర్ణణాతీతం. పశ్చిమ కాశ్మీర్‌లోని 'సాగం' గ్రామానికి చెందిన మీర్‌కు భద్రతా సిబ్బంది తనిఖీల పేరిట వచ్చి అరెస్టులు చేయటం, సోదాల పేరుతో వీరంగం సృష్టించటం చాలా అలవాటైపోయింది. ఎప్పుడు ఎవరు వచ్చి ఏం చేస్తారో, ఎంత హడావిడి చేస్తారో అని ఆ చీకటి రాత్రులని ఇప్పటికీ గుర్తు తెచ్చుకుంటాడు మీర్. దానికి తోడు ఇంట్లో ఎల్లప్పుడూ వెలిగించటానికి దీపం ఉండేది కాదు. రాత్రుళ్ళు టార్చి వెలిగించకూడదని ఆరోజుల్లో కాశ్మీర్‌లో రూలుండేది. ఏ విధమైన సాంకేతిక జ్ఞానం లేకపోయినా అతను ఒక కిరోసిన్ లాంతరు తీసుకొని దానిపైనే ప్రయోగాలు మొదలు పెట్టాడు. కొన్నాళ్ళ శ్రమకి ఫలితంగా కిరోసిన్ స్థానంలో రీ చార్జబుల్ బ్యాటరీలు, వత్తి స్థానంలో బల్బును ఏర్పాటు చేశాడు. అది లాంతరుగా పని చేస్తున్నా, ఆయన దృష్టిలో సగంపని మాత్రమే అయినట్లు భావించాడు. ఎంతో ఆలోచించి, శ్రమించి, ఆ లాంతరుకి ఒక ఆడియో సెన్సారు, ఒక బెల్లు ఏర్పాటు చేశాడు. దానితో దాదాపు 50 అడుగుల దూరంలో ఏవిధమైన అడుగుల చప్పుడైనా ఆ బెల్లు మ్రోగి మనల్ని హెచ్చరిస్తుందా లాంతరు. ఇప్పుడు అర్థరాత్రి ఎవరొచ్చినా భయం లేదు. మాకు ముందుగా తెలిసిపోయి, సిద్ధంగా ఉంటామంటారాయన.

మా కాశ్మీర్‌లో అప్పుడున్న పరిస్థితుల ప్రాబల్యం వల్ల నేనిలాంటి లాంతర్ తయారు చేయవలసి వచ్చింది అని వివరించారాయన. ఇంతటితో ఆగకుండా ఆయన ఈ లాంతరుకి ఎఫ్.ఎం. సర్క్యూట్, స్పీకర్లు ఏర్పాటు చేసి, రేడియో సంగీతం వినేటట్లుగా చేశారు. దాని తర్వాత యు.యస్.బి. పోర్టు ఏర్పాటు చేయటంతో దీనిని కంప్యూటర్‌తో కూడా అనుసంధానం చేయవచ్చు. మెమొరీ కార్డు ఆధారంగా వివరాలను నిక్షిప్తం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఒక లాంతరు ఖరీదు రూ. 1100 నుండి రూ. 1500 వరకు ఉంటుంది. బ్యాటరీ ఒకసారి చార్జి చేస్తే 7 గంటల వరకు పనిచేస్తుంది. ఈయన చేసిన ఈ ఆవిష్కరణకి గుజరాత్ విశ్వవిద్యాలయం వారు "సృష్టి సన్మాన్" పురస్కారంతో సత్కరించారు.

●

**'హన్స్ ఇండియా' ఆంగ్ల పత్రిక**
**తేది 15-4-2012 సౌజన్యంతో....**

# 3వ చిన్న శోధయాత్ర




**మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట నుండి బాకారం వరకు**
**తేది 24 నుండి 26 ఫిబ్రవరి, 2012**

మా దృష్టిలో శోధయాత్ర అనేది మనం మరిచిపోతున్న జ్ఞాన మందిరాలకు వెళ్ళే తీర్థయాత్ర వంటిది. గ్రామాల్లో నివసించే వ్యక్తులు జ్ఞాన వంతులు. ప్రకృతిలో జరుగుతున్న మార్పులకు తగ్గట్టుగా సహజీవనం చేసే వారి నేర్పును అర్థం చేసుకోవటమే మా ఈ శోధయాత్రలో మేం చేసే పని. మేము ఈ శోధయాత్రలో మూడు నాలుగు రోజులు నడుస్తూ ప్రకృతిని అర్థం చేసుకుంటూ గ్రామాలలో నివసిస్తున్న ప్రజలను కలిసి, వారితో సంబంధాలు ఏర్పరచుకొంటాం. మా మూడవ శోధయాత్ర మహబూబ్‌నగర్ జిల్లాలోని 'అచ్చంపేట' నుండి 'బాకారం' వరకు 24 నుండి 26 వరకు ఫిబ్రవరి, 2012 తేదీలలో మూడు రోజులపాటు అచ్చంపేట లోని ఆర్.టి.డి. కార్యాలయ ప్రాంగణం నుండి ప్రారంభమైంది.

**ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యాలు:**

- మార్గంలో ప్రకృతి, చెట్లు, చేమలు, వాటిలో జరిగిన మార్పులని గమనించడం.
- గ్రామాలలోని వ్యక్తుల జీవన విధానాలను గమనించడం.
- ప్రకృతి – ప్రజలు కలిసి చేసే సహజీవనాన్ని అర్థం చేసుకోవడం.
- గ్రామస్తులతో చర్చించి వారి సాంప్రదాయ జ్ఞానాన్ని గ్రహించి, దానిని గ్రంథస్థం చేయటం.
- ప్రత్యేక కౌశల్యం కలవారిని గుర్తించి వారి నైపుణ్యాన్ని గ్రంథస్థం చేయటం.
- 90 సంవత్సరాలకన్నా ఎక్కువ వయసున్న పెద్దలను కలిసి, వారిని వారింట్లోనే సత్కరించటం.
- అభివృద్ధిపై గ్రామస్తులకు కల అవగాహనను అర్థం

చేసుకోవటం.

- వారికి అందుబాటులో వున్న వనరులని వారు ఏ విధంగా ఉపయోగించి, వాటి విలువను పెంచుతున్నారో గుర్తించటం.
- స్వయం శక్తిపై ఆధారపడి వారి విధానాలను అంచనా వేయటం.
- పిల్లలతో మాట్లాడి మీరు సాధించిన అభివృద్ధి గురించి చెప్పి వారిని ప్రోత్సహించటం.
- గ్రామాలలోని యువత వారి తల్లిదండ్రుల ఆశయాలను అంచనా వేయటం.
- వారు ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంలో వున్న తరుగులని అంచనా వేయటం. వారు వాడే పనిముట్లు సరియైనవేనా అని గమనించటం.
- వారి ఆహార, ఆరోగ్య పద్ధతులను గమనించటం.
- వారు జంతువులకి చికిత్స చేయటంలో అవలంభించే సాంప్రదాయ పద్ధతులని గమనించటం.
- గిరిజనులకు భూమిపై ఉండే హక్కులు, అడవుల నిర్వహణా పద్ధతులని గమనించటం.

**శోధయాత్రలో పాల్గొనాలంటే....**

- ఈ చిన్న శోధయాత్రలలో ఎవరైనా ఐచ్ఛికంగా పాల్గొనవచ్చు. దీనికేవిధమైన రుసుము చెల్లించనవసరం లేదు.
- ఈ శోధయాత్రలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఎన్.ఐ.ఎఫ్., హనీబీ ఉద్దేశ్యాలని అర్థం చేసుకున్న స్త్రీ పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చు.
- పాల్గొనేవారందరూ శారీరకంగా సమర్థులై వుండి మూడు రోజులలో 30 నుండి 40 కి.మీ. నడవగలిగేవారై ఉండాలి.
- మీ ప్రదేశం నుండి యాత్ర ప్రారంభమయ్యే ప్రాంతానికి, తిరిగి అక్కడినుండి మీ ప్రదేశానికి వెళ్ళటానికి అయ్యే ఖర్చులు ఎవరికి వారే భరించాలి.
- ఆహారానికయ్యే ఖర్చును మాత్రం అందరూ కలిసి సమానంగా భరించాల్సి ఉంటుంది.
- యాత్రలో క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలి.
- మీతోపాటు మీరు తీసుకు రావలసిన వస్తువులు – మీరు వేసుకున్నవి కాక మరోజత బట్టలు, టార్చిలైటు, స్టీలు ప్లేటు, గ్లాసు, చెంచా, కాగితాలు, పెన్ను, పెన్సిలు, కెమెరా, వీడియోలు, రెండు దుప్పట్లు, దిండు (తప్పనిసరి కాదు), మగ్గు, వాటర్ బాటిల్, టోపి, తగ్గ జోళ్ళు (కొత్తవి వద్దు), ఫస్ట్‌ఎయిడ్ కిట్, ఎవరైనా మందులు వాడుతూ ఉంటే అవి మొదలైనవి...
- మినరల్ వాటర్ వాడకూడదు. యాత్రలో గ్రామస్తుల లాగానే జీవించి, వారితో సహజీవనం చెయ్యాలి.

**ఇతర సమాచారం :**

ఆహారం అందరికీ కలిపి ఏర్పాటు చేయబడు తుంది. దానికయ్యే ఖర్చు దాదాపు రూ. 300 యాత్ర ప్రారంభానికి ముందే స్వచ్ఛందకర్తకు అందజేయాల్సి ఉంటుంది. యాత్రలో ఎవరైనా వయోవృద్ధులను సత్కరించడానికి అయ్యే ఖర్చులకై పాల్గొనేవారు స్వచ్ఛందంగా చందాలు అందజేయవచ్చు. యాత్రలో పాల్గొనేవారందరూ స్వచ్ఛందంగా, మనస్పూర్తిగా పాల్గొనాలి. సహ యాత్రికులతో కలివిడిగా ఉండాలి. గ్రామస్తులని గౌరవంగా పలుకరించి, వారివద్దనుండి వివరాలు సేకరించాలి. యాత్ర చివరి రోజున తమతమ అనుభవాలు అందరితో పంచుకోవాలి. యాత్ర పూర్తయిన తర్వాత దానిపై ఒక సమగ్ర నివేదిక బ్రిగేడియర్ గణేశం గారికి తప్పనిసరిగా అందజేయాలి.

మూడవ చిన్నశోధయాత్రలో పాల్గొన్న కొందరి అనుభవాలు, వారిపై శోధయాత్ర ప్రభావాలను ఈ క్రింద ప్రచురిస్తున్నాం.

**యాత్రలో పాల్గొన్నవారిలో కొందరి అనుభవాలు :**

**<u>వై.వి. శివరామ రెడ్డి, యస్.సి.ఎ.ఐ. సమన్వయకర్త,</u> మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్.**

మా సభ్యులు 3వ చిన్న శోధయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని వచ్చారు. యాత్రలో వారు ఒకరి అనుభవాలు ఒకరితో పంచుకోవడం మాకెంతో ఆనందాన్ని కలుగజేసింది. వారి అనుభవాలు వింటూవుంటే ఎవ్వరూ ఇటువంటి అవకాశాలు వదులుకోకూడదు అనిపించింది. యాత్ర మొత్తం అద్భుతమైన, ఆశ్చర్యకరమైన



విజ్ఞానం ఉందని, అసలు వారే నిజమైన అధ్యాపకులేమో అనిపించింది. గ్రామస్తులకంటే మనమెంత వెనకబడి ఉన్నామో తెలుసుకున్నాము. ఏ ఆధునిక వసతులూ లేకపోయినా మానవుడు ప్రకృతి వడిలో హాయిగా జీవనం సాగించవచ్చు అని నిరూపించబడింది. నా అనుభవాలలో కొన్ని మీముందు ఉంచుతున్నాను.

ప్రకృతిసిద్ధంగా పిల్లలు జనించే పద్ధతి, ప్రకృతిలో దొరికిన వస్తువులతో, వంటింటి ఔషధాలతో సహజంగా వారు రోగ నివారణకు మందులిచ్చే పద్ధతి, వారి ఆరోగ్య చిట్కాలు, వారి దృఢ ఆరోగ్య రహస్యాలు, గ్రామాలలో పిల్లలకి విద్యపై ఉన్న ఆసక్తి, ఇన్నోవేషన్లపై వారికున్న అవగాహన మా యాత్రీకులని అబ్బురపరిచాయి. వారు నాతో వీరే శాస్త్రవేత్తలకూ తీసిపోరని నాతో చెప్పారు.

గ్రామస్తులతో సహజీవనంతో పాటు మా యాత్రీకులు వారు త్రాగునీటికై మూడు మైళ్ళు నడిచి వెళ్ళట ము, అడవి పందుల నుండి వారి పంటను రక్షించుకోవటా నికి వారు పడే పాట్లు, అడవి పక్కనే ఉన్నా, అటవీ అధికారులు తమ పశువులని అడవులలోని రానివ్వని కారణంగా వాటికి దాణా సంపాదించటానికి వారు పడే కష్టాలు గమనించారు. కొన్ని కుటుంబాలు కట్టుకోవడానికి సరైన బట్టలు కూడా లేని స్థితిలో ఉండటం వారిని కలవర పరిచింది.

**ఇంకా మిగిలింది వారి మాటల్లోనే వినండి......**

**నాగరంజని :** 'ఈ మూడు రోజుల అనుభవాలు కొన్ని దశాబ్దాలకైనా మరిచిపోలేను'

మా కళాశాలలో ఈ మూడో చిన్న శోధయాత్ర గురించి తెలియగానే నేను ప్రజల ఆలోచనా విధానాల గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో వెళ్లాలని నిర్ణయించుకున్నాను. హనీబీఎపి కో-ఆర్డినేటర్ గారైన బ్రిగేడియర్ గణేశం గారికి నా నిర్ణయాన్ని మెయిల్ చేశాను కూడా. అనుకోకుండా జ్వరం వచ్చి నేను వెళ్ళగలనా అన్న సంశయం ఏర్పడింది. అప్పుడు మా అధ్యాపకులు శివరామిరెడ్డి గారు నన్నెంతో ప్రోత్సహించారు. నాకెంతో శక్తి వచ్చినట్లనిపించింది. అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నాను. నా మిత్రుడు వరుణ్‌తో కలిసి 3వ చిన్న శోధయాత్రలో పాల్గొనాలని, ఈ యాత్రలో నాకెన్నో అద్భుతమైన అనుభవాలు ఎదురైనాయి.

**వరుణ్ మిత్ర:**

కొత్త గ్రామంలో ఉన్నప్పుడు గ్రామస్తులలాగానే మెలగాలి.

ముందుగా మా ప్రధానాచార్యులు డా. శ్రీనివాస శాస్త్రిగారు మా గురువులు శివరామరెడ్డి గారికి నన్ను 3వ చిన్న శోధయాత్రకు ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. మొదటి రెండు శోధయాత్రలకు నేను వెళ్ళలేకపోయాను. ఈసారి వదల దలుచుకోలేదు. గ్రామస్తులలో ఉండే జ్ఞానాన్ని తెలుసుకోవాలని, వారికి సేవ చేయాలని నేనెంతో ఉత్సాహంగా ఉన్నాను. కనుక ఈ యాత్రలో పాల్గొనటం ఎంతో మంచి అవకాశం అనిపించింది.

**సంయుక్తంగా వారి అనుభవాలు :**

మా 3వ చిన్న శోధయాత్ర 24 ఫిబ్రవరి 2012 నాడు అచ్చంపేట ఆర్.డి.టి. పరిసరాలలో బ్రిగేడియర్ గణేశం గారి ఆహ్వానపూరిత చిరునవ్వుతో ప్రారంభమైంది. దాదాపు 2 గంటలకు భోజనం అయిన తర్వాత మొదటిసారి సూచనలు తీసుకొని మా యాత్ర ప్రారంభించాం. నడిచి వెళుతూ ఉంటే, ఒక బోరు పంపు కనిపించింది. దాని హ్యాండిల్‌కి ఒక రబ్బరు టైరు అమర్చబడి ఉంది. హ్యాండిల్ కొడుతూ ఉంటే అది ఎక్కువ దెబ్బ తినకుండా ఉండడానికి ఎవరో ఏర్పాటు చేశారు.

దాదాపు రెండు కిలోమీటర్లు నడిచిన తర్వాత అలసట అనిపించింది. ఇంకా రెండు రోజులు ఎలా నడుస్తామా అనిపించింది. కానీ, గణేశం గారి ఉత్సాహపరిచే

మాటలు, పిట్టకథలు మాకు ఏ విధమైన అలసటా తెలియనివ్వలేదు.

మేము చౌటుపల్లి చేరుకొని కొందరు గ్రామస్తులతో మాట్లాడి కొన్ని ఇళ్ళు సందర్శించాము. తర్వాత తోవలో ఒక రైతు వేరుశనగ పొలంలో పనిచేయటం గమనించాము. అతడికి పంట కోయటంలో కొంతసేపు సహాయం చేశాము. దాదాపు ఒక కిలోమీటర్ నడిచిన తర్వాత వేరుశనగని చెట్లనుండి కాయలను వేరుచేసే యంత్రాన్ని మొదటిసారి చూశాము. అక్కడ వారితో కలిసి కొద్దిసేపు పనిచేస్తూ వుంటే ఎంతో ఆనందం అనిపించింది.

అక్కడే ఒక 7 సంవత్సరాల పిల్లవాడు రీఫిల్‌తో (పెన్ను లేదు) ఇంగ్లీషులో డైరీ వ్రాయటం గమనించాము. అతనివద్ద ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. కానీ, వాటిని పెట్టుకోవటానికి ఒక సంచి లేదు. వ్రాసుకోవటానికి పెన్ను లేదు. అతన్ని చూస్తే జాలేసింది. ఒక పెన్ను బహుమానంగా ఇచ్చాము. అతడికి మా ఫోన్ నెంబరు ఇచ్చి ఏదైనా సహాయం కావాలంటే మాట్లాడమని చెప్పాము.

తర్వాత ఒక పెద్దాయనతో ఒక అరగంటసేపు మాట్లాడాము. అతని మాటల్లో గ్రామ యువత మద్యానికి బానిసలవుతున్నారని బాధ పడటం గమనించాము. అతనో సామెత చెప్పాడు "కుండలో ఉంటే తాగుతారు లేకపోతే లేదు" అని. నిజమే అందుబాటులో లేకపోతే ఈ వ్యసనం తగ్గుతుందేమో. అక్కడే దాదాపు 110 సంవత్సరాల వయసున్న ఒక వృద్ధున్ని చూశాము. ఆశ్చర్యం వేసింది.

మొదటిసారి రాత్రి స్వచ్ఛమైన ఆకాశంలో చుక్కలకింద నడవటం ఎంతో ఆనందం అనిపించింది. అప్పుడు గమనించాము అడవి మార్గంలో మాలో కొందరు తప్పిపోయారని. కొందరు ముందుకెళ్ళిపోయారు, కొందరు వెనకబడిపోయారు. చుట్టూ ఏమీ కనిపించటం లేదు. కొంతసేపటికి మాకోసం వేచివున్న యాత్రీకుల లైటు కనిపించింది. మొత్తానికి అందరం కలుసుకొని యాత్ర కొనసాగించాము. ఎలాగైతేనేం ఒక బాలికల పాఠశాల చేరుకున్నాం. ఆరోజు మా అనుభవాలు ఒకరితో ఒకరం చెప్పుకుంటూ గదుల్లోకెళ్ళి హాయిగా నిద్రపోయాము.

మర్నాడు ఆ బడి ఆడపిల్లలు ఉదయం 4 గంటలకే మాకన్నా ముందే లేచి యోగా లాంటి కార్యక్రమాలు చేస్తూ ఉండటం గమనించాము. వారి ఆతిథ్యం ఎంతో బావుంది. వారి ఆత్మీయతకు ఎంతో రుణపడి వుంటాం.

ఆరోజుకి యాత్ర ప్రారంభించాము. త్రోవలో ఒక రైతు వేరుశనగ పంటలో పనిచేస్తూ వుండగా గమనించి, ఆయనను పలకరించి దిగుబడి గురించి అడిగాము. బాగాలేదు, నష్టపోయాను అని చెప్తూనే మాకు వేరుశనగలిచ్చారాయన. తోవలో గణేశం గారు మేనేజ్‌మెంట్ విషయమైన 'డైలమా' గురించి చెప్పింది మా హృదయాలకు హత్తుకుని పోయింది.

మధ్యాహ్నం పక్కనున్న అడవి వైపునుండి చల్లని గాలి వీస్తూవుంటే ఒక మామిడి చెట్టుకింద చక్కని భోజనం చేశాం. అకస్మాత్తుగా రంజనికి సుస్తీ చేసింది. స్థానికంగా గ్రామంలో ఉండే మహిళ ఒకామె వాము, వెల్లుల్లి కలిపి ఇచ్చింది. ఆవనూనెతో మర్దనా చేసింది. ఆమెకు కొద్ది నిమిషాల్లోనే ఉపశమనం కలిగి నడవగలిగింది. 7 గంటలకు లింగాల గ్రామం చేరుకొని అక్కడ వారికి ఇన్నోవేషన్లకి సంబంధించిన కొన్ని వీడియోలను చూపించాం. వారి ఆలోచనలు విన్నాక మాకెంతో ఆశ్చర్యం వేసింది. రైళ్ళల్లో ప్రయాణానికై ఆటోమేటిగ్గా టిక్కెట్లు అమ్మే యంత్రం ఏర్పాటు చేస్తే బావుంటుందని ఒక విద్యార్థిని తన ఆలోచన చెప్పింది. రాత్రి దాదాపు 9-30కి భోజనం చేసి ఆరోజు జరిగిన మా అనుభవాలు చెప్పుకుంటూ తరగతి గదుల్లోకెళ్ళి నిద్రపోయాము.

మర్నాడు ఉదయం పాఠశాలనుంచి మా




శోధయాత్ర ప్రారంభించి సారవంతమైన భూమి గురించి మాట్లాడుకుంటూ భూసారాన్ని ఏ విధంగా పెంపొందించ వచ్చు అని చర్చించాము. అనంతవరం ప్రభుత్వ పాఠశాల చేరుకొని అక్కడ పిల్లలతో కొంతసేపు మాట్లాడాము. తర్వాత మేమూ చిన్న పిల్లలమైపోయి వారితో పాటు ఎగురుతూ, గెంతుతూ ఆడుకున్నాము. అప్పుడు ఒక బాధాకర సన్నివేశం ఎదురైంది. అక్కడొక పిల్ల రజస్వల అయింది. ఆశ్చర్యం ఆమెకు ఆ విషయం తెలియదు. ఆమెకి మార్చుకోవడానికి ఇంకొక జత బట్టలు కూడా లేవు. ఆమె చిరునామా తీసుకున్నాము. మేము తిరిగి వెళ్ళి ఆమెకు బట్టలు సేకరించి పంపుదామని నిర్ణయించుకున్నాము. అక్కడే ఒక వయోవృద్ధున్ని కలిసి మీరింత ఆరోగ్యంగా ఉండడానికి కారణం ఏమిటని అడిగితే తాను రోజూ రాగి సంకటి, మేకపాలు, అడవితేనె తీసుకుంటానని చెప్పాడు.

వాతావరణ మార్పు కారణంగా నా శరీరంలో మార్పు వచ్చి వేడి చేసింది. అప్పుడొక మహిళ కాలి బొటనవేలికి సున్నం రాసుకోవమ్మా ఉపశమనం కలుగుతుంది అని చెప్పింది. బహిష్టు సమయంలో వచ్చే కడుపు నొప్పికి శొంఠి, తెల్ల మిరియాలు, వాము, వెల్లుల్లి, సోంపు, నెయ్యి కలిపి డికాక్షన్ తయారు చేసి పాలతో కలిపి తీసుకుంటే మంచిది అని అక్కడే తెలిసింది మాకు.

**3వ చిన్న శోధయాత్రలో మేము తెలుసుకున్నవి మీకు తెలియజేస్తాం......**

- ❀ గ్రామస్తులనుండి ఆతిథ్యం ఎలా ఇవ్వాలో మేము తెలుసుకున్నాం.
- ❀ ఆధునిక వైద్యంకంటే ప్రకృతిసిద్ధంగా దొరికే వస్తువులతో ఎంతోమంచి వైద్యం అందించవచ్చు అని తెలుసుకున్నాము.
- ❀ ఈ యాత్ర మా ఆలోచనా సరళినే మార్చివేసింది. ఇంతకుముందు పల్లెటూరివారికన్నా మాకెంతో జ్ఞానం ఉంది అనుకునేవాళ్లం. కానీ, ఈ యాత్ర తర్వాత వారికే మాకన్నా ఎక్కువ జ్ఞానం ఉంది అని తెలుసుకున్నాం.
- ❀ ఈ యాత్ర వలన మనుషులని గౌరవించటం నేర్చుకున్నాం. జంతువులని రక్షించటం (పెంచటం) నేర్చుకున్నాం.



మేమిప్పుడు సమాజంలో బాధ్యతగల వ్యక్తులుగా మారాం. తోటి మానవులని గౌరవించటం, వనరులని జాగ్రత్తగా వాడటం నేర్చుకున్నాం. నేను పొదుపు చేసిన సొమ్మును సాంఘిక సంక్షేమానికే వాడుతాం. భవిష్యత్తులో ఇటువంటి యాత్రలో ఇంకా పాల్గొనాలని ఉంది.

**3వ చిన్న శోధయాత్రలో వరంగల్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థుల అనుభవాలు :**

మేము వరంగల్‌కు చెందిన ఎన్.ఐ.టి. విద్యార్థులం కొందరం మా కళాశాల నుండి పెందరాళే బయలుదేరి హైదరాబాద్ చేరుకున్నాం. అక్కడ నుండి బస్సులో మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట చేరుకున్నాము. మార్గమధ్యలోనే పరిసరాలు ఎండిపోయి ఉండటం, చెట్లు తగ్గిపోయి ఉండటం గమనించాము. తరవాత యాత్రలో తెలిసింది ఈ ప్రాంతం వర్షాలు లేక తీవ్రమైన నీటియెద్దడికి గురవుతోందని. అంతా ఆర్.డి.టి. కార్యాలయంలో కలుసుకున్నాం. అక్కడ పరిచయాలు చేసుకుని భోజనం చేసి యాత్ర ప్రారంభించాము. మార్గంలో నీటి బోర్లు పనిచేయకపోవటం, డ్రైనేజీ పద్ధతి లేకపోవటం, ప్రభుత్వ పాఠశాలలకి మున్సిపల్ నీటి సరఫరా లేకపోవటం గమనించాము. మాకు మునగాకు తింటే శరీరంలో ఐరన్ లోపాన్ని అరికట్టవచ్చునని, మునగాకుని కూరగా చేసుకుని తింటారని అక్కడే తెలిసింది.

మేము చౌటుపల్లి చేరుకున్నాం. మహేష్ అనే పాఠశాల విద్యార్థిని కలిశాం. అతడు ఆంగ్లంలో వ్రాసుకునే డైరీ, అతని చేష్టలు మాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. తర్వాత ఎంతో ఓపిక, శాంతము, కలిగివున్న ఒక 75 సంవత్సరాల ఆయనను కలిసి మాట్లాడించాము. ఈసారి వర్షాలు




ఫరవాలేదని, తాను జొన్నలు, బుడ్డలు తింటానని, దాయిాలు స్థానికంగా గత 30 ఏళ్ళనుండి వైద్యం (ప్రసవాలు) చేస్తున్నారని, మేక కేవలం ఉదయం లేదా సాయంత్రం పూటే మేకపిల్లకి జన్మనిస్తుందని, తాగుడు అలవాటు గురించి మాట్లాడుతూ అందుబాటులో లేకపోతే ఆ అలవాటు తగ్గుతుందని, ఈకాలం యువతలో 'అల్పం' ఎక్కువని, అంటే నిస్సహాయత, కోపం, ఉక్రోషం, గౌరవం లేకపోవటం ఎక్కువయ్యాయని ఆయన అభిప్రాయ పడ్డాడు. ఇటువంటి పెద్దలనుండి ఎంతైనా నేర్చుకోవచ్చనిపించింది. కాలానుగుణంగా ఎలా మార్పులు వస్తాయో, ప్రశాంతంగా జీవించాలి అంటే మనం చుట్టూ గమనించటం, ఓపికగా ఉండటం, కొత్తవి స్వీకరించటం లాంటివి చేయాలి. అయినా మన మౌళిక విలువను కోల్పోకూడదు. ఇలా చెప్పుకుపోయాడాయన. తర్వాత వేరుశనగను వేరుచేసే యంత్రాన్ని చూశాము. పక్క గ్రామంలో ఒక జంటని కలిశాము. అతని పేరు గానయ్య, వయస్సు వంద సంవత్సరాల పైనే అని తెలుసుకుని అవునా! అని ఆశ్చర్యపోయాము. ఎవరో చెప్పారు ఆయన ఎంత స్వచ్ఛమైన మనసు కలవాడంటే ఎవరో మీ కుటుంబానికి జొన్నరొట్టెలు పెడతాను అంటే తన పొలం ఇచ్చేశాడట. అదే కారణం అయి ఉండవచ్చు. ఆయన ఇంతకాలం ప్రశాంతంగా జీవించటానికి.

మేము 'బానాల' చేరుకుని అక్కడి గిరిజనులని కలిశాము. చక్కగా స్వాగతం పలికారు. వారి పరిస్థితి చాలా బాధాకరంగా ఉంది. మేము అక్కడ ఓ వయసు మళ్ళిన జంట – నారాయణ రెడ్డి, రామచంద్రమ్మలని కలిశాలు. వారు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉండటానికి కారణం వారు రోజూ జొన్నరొట్టెలు, పాలు పెరుగు తీసుకుంటారట. వాళ్ళ ముఖాల్లో ఎంతో ప్రశాంతత కనిపించింది. తర్వాత రాత్రిపూట చుక్కల వెలుగులో ప్రయాణం చేస్తూ చెంచుగూడెం లోని బాలికల పాఠశాల చేరుకున్నాము. ఆ రాత్రి ఒకరి అనుభవాలు ఒకరు చెప్పుకుంటూ ఉంటే వారివారి దృక్పథం, తెలిసింది.

మర్నాడు ఉదయం పిల్లలకి ఆలోచనల పోటీ పెడితే పిల్లలు వాళ్ళ ఆలోచనలు చెప్పారు. అవి చూస్తే వీళ్ళకిన్ని ఆలోచనలున్నాయా అనిపించింది. తర్వాత ఒక పిల్ల పాడిన పాట మమ్మల్నందర్నీ కదిలించి వేసింది. ఆ పాటలా గుర్తుండిపోయింది. తర్వాత తోవలో ఒక రైతుకి వేరుశనగని పీకటంలో సహాయం చేశాము. అతడు నష్టాల్లో వున్నా అతను మాట్లాడిన తీరు, ఇచ్చిన ఆతిథ్యం చూస్తే నేను ఇలా ఇవ్వగలనా అనిపించింది. గ్రామంలో ఒక గ్రామస్తుడు నీటి సమస్య తీర్చటానికి మీరు తప్పకుండా ఏదైనా చేయాలి అని ప్రాధేయపడ్డాడు. మేము ప్రభుత్వానికి సంబంధించిన వాళ్ళం అనుకుని ఇటువంటి అనుభవం మాకు చాలాసార్లు ఎదురైంది. ఆ ప్రాంతం తీవ్ర నీటియెద్దడికి గురవుతుందని, వర్షాలు లేవని, భూమిలో నీటిమట్టం తగ్గిపోతోందని తెలుసుకున్నాం. మధ్యాహ్నానికి 'అంబగిరి' చేరుకున్నాం. అక్కడ కొందరు పెద్దలతో మాట్లాడాము. వాళ్ళ జ్ఞానాన్ని చూస్తే ఆశ్చర్యం, ఆనందం వేసింది. వాళ్ళు ఏ దాపరికమూ లేకుండా స్వచ్ఛంగా మాట్లాడట చూస్తూవుంటే మనమలా ఉండగలమా అనిపించింది. వాళ్ళ మాటల్లో అడవులు తగ్గిపోవటం, నీటియెద్దడి, అడవిపందుల బెడద ప్రధానంగా చోటుచేసుకున్నాయి. గ్రామస్తులతో మాట్లాడుతూ వుంటే పెళ్ళి అయిన స్త్రీని, పెళ్ళికాని అమ్మాయిని ఎలా గుర్తించాలో తెలిసింది. పెళ్ళి అయినవారు మోచేతులపైన కూడా గాజులు ధరించి ఒక ప్రత్యేక రకమైన చెవిదుద్దులు వాడుతారట!. తర్వాత భోజనం చేసి ముందుకు సాగాం.

సాయంత్రానికల్లా ఒక బడి చేరుకున్నాం. అక్కడ పంతులుగారు తాను స్వంతంగా ఊరివాళ్ళను ప్రేరేపించి బడిలో నూరుశాతం హాజరు ఉండేలా ప్రయాసపడ్డారట.

దానికి ఊళ్ళో చిన్న చిన్న గుంపులను ఏర్పాటు చేసి, దానికొక నాయకున్ని కూడా నియమించాడట. మంచి ఆలోచన అనిపించింది. రాత్రికల్లా 'లింగాల' లోని బాలుర వసతిగృహం చేరుకున్నాం. అక్కడ వారికి ఎన్.ఐ.ఎఫ్. వారి వీడియోలు చూపించాం. వారి ఆలోచనలను సేకరించాం. చాలా బాగున్నాయి. కానీ, భవిష్యత్తులో విద్యపై వారికి సరియైన అవగాహన లేదేమో అనిపించింది.

మర్నాడు మా యాత్రీకులమంతా చిన్న పిల్లలతో కలిసి మేమూ చిన్నపిల్లలమైపోయి చాలాసేపు ఆడుకున్నాం. తర్వాత 'జెలుగుపల్లి'లో ఒక పిల్ల రజస్వల అయినప్పుడు చుట్టూ ఎంత అపరిశుభ్ర వాతావరణముందో గమనించాము. మామూలుగా అక్కడ స్త్రీలు బహిష్టు సమయంలో ఎంత అనారోగ్యకర వాతావరణంలో జీవిస్తున్నారో అవగాహన అయింది. తర్వాత 'దత్తారం' గ్రామంలోని వ్యక్తులతో మాట్లాడుతూ వుంటే ఆ గ్రామం తన అస్తిత్వం కోల్పోతుందని, యువత బతుకుతెరువుకై వలస వెళ్ళిపోతున్నారని, గ్రామంలో మౌలిక వసతుల్లేవని, సరైన ఆరోగ్య సేవలు లేవని తెలిసింది. తర్వాత మా అనుభవాలు ఒకరికొకరం చెప్పుకొని యాత్ర ముగించుకొని 'అచ్చంపేట' బస్సు ఎక్కాం. అక్కడ భోజనం చేసి తిరిగి మా ఇళ్ళకు బయల్దేరాం.

**ఈ యాత్రలో మేం గమనించినవి:**

- ఈ ప్రాంతంలో తీవ్రమైన నీటియెద్దడి ఉన్నది.
- ఈ ప్రాంత ప్రజలు ఎంత ప్రతికూల పరిస్థితులున్నా ఎంత శాంతంగా ఉంటారో చూసి ఆశ్చర్యం వేసింది.
- చాలా ప్రదేశాలలో అత్యవసర వైద్యసదుపాయాలు లేవు.
- సాధారణంగా నైతిక విలువలు తగ్గిపోతున్నాయి.
- కొందరు గతంలో జీవిస్తూ ప్రస్తుతం మీద అసహనంగా ఉన్నారు.
- వారు అలవాటుగా తినే ఆహార పదార్థాల కొరత ఏర్పడుతోంది.

ప్రతిసారీ ఈ శోధయాత్రలలో నేను, నా తోటివారు ఏదో కొత్త విషయం నేర్చుకుంటూనే ఉన్నాం. ఈ యాత్ర కారణంగా నేను అంతర్ముఖంగా ఉంటానని, ఇతర వ్యక్తులని సరిగ్గా అవగాహన చేసుకోలేనని, ఈ లక్షణాలని అధిగమించాలని తెలుసుకున్నాను.


# 4వ చిన్నశోధయాత్ర

ఖమ్మం జిల్లాలోని
ఉత్తర అటవీప్రాంతంలో
జూన్, 2012లో జరుగుతుంది.
వివరాలకై
www.pallesrujana.org
వెబ్‌సైట్‌ను చూడండి లేదా
'పల్లెసృజన'
కార్యాలయాన్ని సంప్రదించండి.

# ఢిల్లీలోని గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్ & సాంప్రదాయ జ్ఞానం అవార్డుల ప్రధానోత్సవంలో మన రాష్ట్రానికి వచ్చిన ప్రశంసా పత్రాలు

2012 మార్చి 5 నుండి 15వ తేదీ వరకు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన 6వ జాతీయ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన, అవార్డుల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ ఉత్సవంలో మన రాష్ట్రానికి 4 అవార్డులు దక్కాయి. 1. పల్లెసృజన (బ్రిగేడియర్ గణేశం), 2 బోయ పెద్ద రాజన్న, 3. భూమయ్య చారి, 4. చింతకింది మల్లేశంలకు ఈ పురస్కారాలు దక్కాయి.




మన **పల్లెసృజన**

గ్రామీణ ప్రాంతాల్లోని ఇన్నోవేషన్లను, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకురావటంలో చేసిన సేవకు గుర్తింపుగా అందించిన ప్రశంసా పత్రం




అనంతపురం జిల్లాకు చెందిన

**శ్రీ బోయ పెద్ద రాజన్న**

గారికి, గ్రామీణ పశువైద్యానికి చేసిన సేవకు గుర్తింపుగా అందించిన ప్రశంసా పత్రం




నిజామాబాద్ జిల్లాకు చెందిన

**శ్రీ టి. భూమయ్య చారి**

గారికి, కొత్తరకం రెక్కలుగల గాలిమరను తయారు చేసినందుకు గుర్తింపుగా అందించిన ప్రశంసా పత్రం




మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన

**శ్రీ నజీర్ అహమ్మద్**

గారికి, మిర్చి పౌడర్‌ను జల్లెడపట్టే పరికరాన్ని తయారు చేసినందుకు గుర్తింపుగా అందించిన ప్రశంసా పత్రం



# నూనెగింజలు పండించే రైతుల ఇన్నోవేషన్లు

**నూనె గింజలు పండించే రైతుల సమావేశం మార్చి నెలలో హైదరాబాదులో జరిగింది. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి రైతు ఇన్నోవేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వారు విజయవంతంగా నూనెగింజల పంట పండించడంలో చేసిన ఇన్నోవేషన్లను, విజయవంతమైన వాటి ఫలితాలను అందరితో చర్చించారు. వీటి వివరాలను 'పల్లెసృజన' పాఠకులకు అందిస్తున్నాము.**

**- ఎడిటర్**

| వ. సం. | రైతు/కనిపెట్టిన వారి పేరు చిరునామా | కనిపెట్టినది |
|---|---|---|
| 1 | **శ్రీ సోంభాయ్ రమాభాయ్ ప్రజాపతి,** కసల్‌పుర, కనకరాజ్ తా., బనస్కాంత జిల్లా, గుజరాత్. సెల్ : 09427649400 | ❀ ఆముదాలను సాధారణ కొలత (120 జ 90 సెం.మీ.) లతో నాటితే హెక్టారుకు 4.5 టన్నుల పంట పండించవచ్చు అలా కాకుండా ఎక్కువ కొలతలతో (210 జ 180 సెం.మీ.)లలో నాటి హెక్టారుకు 9 టన్నుల ఆముదాలను పండించాడు.<br>❀ 40% నీటిని పొదుపు చేసి ఈ ఆముదపు పంటను పంట మార్పిడి పద్ధతిలో పండించాడు. |
| 2. | శ్రీ సోంభాయ్ నాగ్‌జీభాయ్ ప్రజాపతి, కసల్‌పుర, కనకరాజ్ తా., బనస్కాంత జిల్లా, గుజరాత్. సెల్ : 09253073400 | ❀ ఆముదాలను సాధారణ పద్ధతిలో కాకుండా 180 జ 180 సెం.మీ. కొలతల్లో 30 జ 30 జ 30 గుంతలు తీసి ఆ గుంతలను ఎఫ్.వై.ఎం., డి.ఎ.పి. మరియు సూపర్ ఎరువులతో నింపి నాటాడు. అలా చేయటం వల్ల 60% ఎరువుల వాడకాన్ని తగ్గించాడు.<br>❀ సాధారణంగా 4.5 టన్నులు హెక్టారుకు పండే పంట స్థానంలో 8.5 టన్నులను పండించాడు. ఇదే ఆ గ్రామంలో గరిష్ట దిగుమతి. |

| | | |
|---|---|---|
| | | ❀ చిక్కుడు, ఆముదాల మిశ్రమ పంటను వేసి మళ్ళీ అందులో పంట విరామ కాలంలో గోధుమలు బార్లీని కూడా అదే పొలంలో పండించాడు.<br>❀ ఈ పద్ధతిలో పంటలను తీయటం వల్ల మంచి దిగుబడి, ఆదాయాన్ని పొందటమే కాక, తక్కువ పొలంలో ఎక్కువ పంటలు తీయటం జరిగింది. |
| 3. | **శ్రీ మహబీర్, తండ్రి శ్రీ ఉమ్‌రావ్ సింగ్,** గుడ్యాని పోస్ట్ & గ్రా., రెవారి జిల్లా, హర్యానా. సెల్ : 080536 81425 | ❀ మైక్రో స్ప్రింక్లర్ల వినియోగంతో ఆముదపు పంటను పండించటం వల్ల ఎక్కువ నీటిని పొదుపు చేయగలిగాడు.<br>❀ పంట విరామ సమయంలో ఆముదంతో పాటు చికోరీని కూడా పండించాడు.<br>❀ నీటిని ఎక్కువగా పొదుపు చేయటమే కాక, ఎక్కువ పంట, ఎక్కువ ఆదాయాన్ని పొందాడు. |
| 4. | **శ్రీ ధరమ్‌సింగ్, తండ్రి శ్రీ పర్బతిలాల్,** ఖైరానా గ్రా., బేవాల్ పోస్ట్, మొహిందర్ ఘర్ జిల్లా, హర్యానా. సెల్ : 09466020437 | ❀ కేవలం 60 రోజుల్లో కాపుకు వచ్చే జె.యస్.ఐ.-97 రకం ప్రొద్దుతిరుగుడు విత్తనాలు నాటి ఆ పంట కోతకు వచ్చిన వెంటనే జె.యస్. 95 రకం సోయాబీన్‌ను నాటి ఒకే పంట కాలంలో రెండు పంటలను హెక్టారుకు 19 క్వింటాళ్ళ ధాన్యం పండించాడు.<br>❀ ఇది గోధుమల కన్నా మంచి ఫలితాల నిచ్చింది. గోధుమలు నాటాలంటే పొలంలో నీరు ఎక్కువగా వినియోగించాల్సిన అవసరం ఉంది. ఈ పంటలను నీటితో అవసరం లేకుండానే కేవలం వర్షాధారంతో పండించాడు. |
| 5. | **శ్రీ సుభాష్, తండ్రి శ్రీ దయారామ్,** గోపీపూర్ గ్రా., దేవాస్ జిల్లా, మధ్యప్రదేశ్. సెల్ : 09424852349 | ❀ జె.యస్.ఐ.-97 రకం ప్రొద్దుతిరుగుడు (60 రోజుల్లో కాపుకు వచ్చేది), జె.యస్. 95 రకం సోయాబీన్ పంటలను ఒకేసారి నాటి మంచి ఫలితాలను సాధించాడు. మంచి పద్ధతిలో పంట నాటడం వల్ల హెక్టారుకు 25 క్వింటాళ్ళ దిగుబడిని సాధించాడు. |
| 6. | **శ్రీ రాకేష్ కుమార్ జాట్, తండ్రి శ్రీ గణపతిలాల్ జాట్,** కమలాపూర్ గ్రా., దేవాస్ జిల్లా, మధ్యప్రదేశ్. సెల్ : 09755805221 | ❀ ప్రొద్దుతిరుగుడు సాగులో మెళకువలను పాటించి, తన పొలంలోని గట్ల వెంట (అన్ని వైపులా 6 అడుగులు మాత్రమే) పురుగు మందులను స్ప్రే చేయటం వల్ల పురుగు మందుల ఖర్చును తగ్గించటంతో పాటు 17% ఎక్కువ దిగుబడిని సాధించాడు. |
| 7. | శ్రీ మనోహర్ ఆర్. పవాడే, గుడాది పోస్ట్ & గ్రా., అకోలా తాలూకా & జిల్లా. మహారాష్ట్ర, సెల్ : 09420101852. | ❀ ప్రొద్దు తిరుగుడు విత్తనాలను మిషన్లలో వేసి ప్రోగు చేసే పద్ధతికి భిన్నంగా చిన్న టెక్నిక్‌ను కనుగొని కర్రలతో కొట్టి విత్తనాలను కంకుల నుండి వేరు చేయటం వల్ల ఆ హైబ్రిడ్ విత్తనాలు ఎక్కువ నాణ్యత, ఎక్కువ మొలక శాతాన్ని సాధించాయి. |
| 8. | **శ్రీ జనార్ధన్, తండ్రి శ్రీ వి. లాహెూలే,** అంబాసి గ్రా., విర్వా పోస్ట్ పాటూర్ తాలూకా, అకోలా జిల్లా. మహారాష్ట్ర. సెల్ : 09503 336411 | ❀ ఆముదాలను మిశ్రమ పంటగా నాటే కొత్త పద్ధతిని వినియోగంలోకి తెచ్చాడు. పెసర పంటతో పాటు ఆముదాలను నాటి రెండింటిలో అధిక దిగుబడి సాధించాడు. నాటే పద్ధతిలో మెళకువను వినియోగించాడు. ప్రతి 5 వరుసల పెసర పంటను నాటిన తర్వాత ఒక వరుసను ఖాళీగా ఉంచాడు. ఆ తర్వాత ఆముదాలను తగిన సీజన్ ఈ ఖాళీ వరుసలో 30 సెం.మీ.కు ఒక మొక్క చొప్పున నాటటం వల్ల పెసరతో పాటు ఆముదాలలో కూడా మంచి దిగుబడిని సాధించాడు. |

| | |
|---|---|
| 9. **శ్రీ నరేంద్ర కాశీరామ్‌జీ సింఘానే,** చించోలి (సింఘానే) గ్రా., అంజన్ గావ్ (సుర్జీత్) తా., అమరావతి జిల్లా సెల్ : 09764752780 | ❀ జైక్వాడి ప్రాజెక్ట్ కమాండ్ ఏరియా ప్రాంతంలో గోధుమ స్థానంలో కుసుమలు వేసి మొదటిసారి, 35 రోజులకు, రెండవసారి 75 రోజులకు ఇలా రెండుసార్లు మాత్రమే స్రింక్లర్ల సహాయంతో నీరు అందించాడు. ❀ గోధుమ పంటకు కావలసిన నీటికన్నా తక్కువ నీరు వాడటంతో నీటి ఎద్దడి సమస్యను అధిగమించాడు. ❀ రైతునుండి రైతుకి విత్తనాలను అందజేసుకునే పద్ధతి ద్వారా 2007–08లో 5 హెక్టార్లుండే కుసుమ పంట ప్రస్తుతం మిశ్రమ పంటగా 75 హెక్టార్లకు విస్తరించింది. |
| 10. **శ్రీ బాలాసాహెబ్ నివ్రతి రెంజె,** జంబ్ తా., పర్బాని జిల్లా, మహారాష్ట్ర. సెల్ : 09881694534 | ❀ ఖరీఫ్ కాలంలో భూమిలోని తేమని కాపాడుకోవటం కొరకు ప్రతి సంవత్సరం పంట మార్పిడి పద్ధతిలో కుసుమలు, జొన్న పంటలను వేశాడు. ❀ భూమిలో వివిధ లోతులలో పంటలను నాటి తేమను పోషక విలువలను పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. ❀ కుసుమలను మిశ్రమ పంటగా పండించాడు. |
| 11. **శ్రీ గోదాలె మారుతి సిద్రామ్,** ఎ/పి– భండార్ కవాతె, సౌత్ సోలాపూర్ తా., సోలాపూర్ జిల్లా (మహారాష్ట్ర). సెల్ : 09503415841 | ❀ తక్కువ దిగుబడినిచ్చే జొన్న పంట స్థానంలో శనగ + కుసుమలను 6:3 నిష్పత్తిలో మిశ్రమ పంటగా వేశాడు. ❀ ఇవి విడివిడిగా వేసేకన్నా మిశ్రమ పంటగా వేస్తే లాభసాటిగా దిగుబడినిచ్చింది. శనగలు పప్పుదినుసు కనుక భూమిలోని నత్రజనిని పెంపొందింపజేస్తుంది. ❀ ఈ విధంగా ఎక్కువ లాభసాటి వ్యవసాయం చేయగలిగాడు. |
| 12. **శ్రీ రాంపురె శ్రీశైల శివప్ప,** ఎ/పి కానస్, అక్కల్‌కోట్ తా., సోలాపూర్ జిల్లా. (మహారాష్ట్ర). సెల్ : 09665239526 | ❀ పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనేలా చేసి కేవలం విత్తనాలు పండించే గ్రామాలుగా కొన్ని గ్రామాలలో నాణ్యమైన ప్రొద్దుతిరుగుడు విత్తనాలను ఉత్పత్తి చేశారు. ❀ పెద్దమొత్తంలో నాణ్యమైన ప్రొద్దుతిరుగుడు విత్తనాలను రైతులకు అందించటమే కాక, మహిళలకి, యువతకి ఉపాధి కల్పించటంతో పాటు ప్రొద్దుతిరుగుడును వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయటంకన్నా ఈ పద్ధతిలో 20–30 శాతం అధిక ఆదాయాన్ని సమకూర్చగలిగారు. |
| 13. **శ్రీ చున్నారమ్ ముర్ము,** సోనాముఖి బ్లాక్, వెస్ట్ బెంగాల్. | ❀ కుసుమ పువ్వుల రెక్కలను సేకరించి మార్కెట్‌లో విక్రయించి అదనపు ఆదాయాన్ని పొందాడు. |
| 14. **శ్రీ షెకావత్ సోమ్లా,** చిట్లం కుంట మం., అమ్రాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా. ఆం.ప్ర. | ❀ మొక్కల మధ్య ఎక్కువ దూరం పద్ధతిలో ఆరుతడి పంటగా ఆముదాలను పండించాడు. ❀ పంట ఏపుగా పెరిగింది, ఎక్కువ ఆముదపు దిగుబడిని ఆశిస్తున్నాడు. ❀ తోటి రైతులను ఆముదపు మొక్కల మధ్య ఎక్కువ దూరం పాటించేలా ప్రోత్సహిస్తున్నాడు. |

**వ్యవసాయ రంగంలో మీరుకూడా ఏదైనా నూతన పద్ధతులను వినియోగించి లాభపడినట్లయితే మాకు తెలియజేయండి. 'పల్లెసృజన'లో ప్రచురించి ఆ ప్రయోగాన్ని యావత్ రైతాంగం ఉపయోగించుకొని ఎక్కువ దిగుబడి సాధించేందుకు ఉపయోగపడుతుంది.** **- ఎడిటర్**




# చుక్క చుక్క నీరు

**22 మార్చి**
**ప్రపంచ 'వాటర్‌డే' సందర్భంగా**
**ప్రత్యేక వ్యాసం**

ప్రపంచంలో అన్నిటికన్నా విలువైనది బంగారం, ప్లాటినం, వజ్ర వైడూర్యాలు కాదు. అన్నిటికన్నా విలువైనది నీరు. అవును నీరే. ఇది నమ్మశక్యం కాకున్నా పరమ సత్యం అన్నది గ్రహించాలి.

భూగోళంలో 1/4వ వంతు భూమి, 3/4వ వంతు నీరు అని ఎవర్ని అడిగినా చెబుతారు. ఇంత నీరుందిగదా మరెందుకు భయం అంటారా.... మన ప్రపంచంలో వున్న నీటిలో 97 శాతం ఉప్పునీరు లేదా తాగటానికి పనికి రానివి. 2 శాతం మంచు రూపంలో ఉంటుంద. కేవలం ఒక్క శాతం లేదా అంతకన్నా తక్కువ మాత్రమే వ్యవసాయానికి, తాగటానికి అనువైన నీరు.

మనకున్న నీటి వనరులలో 70 శాతం వ్యవసాయానికి, 22 శాతం పరిశ్రమలకి, కేవలం 8 శాతం ఇంటి అవసరాలకి వాడుతున్నాం.

2050 నాటికి ప్రపంచ జనాభాలో 47 శాతం మంది తీవ్రమైన నీటి వత్తిడి ఎదుర్కుంటారు. ప్రపంచ యుద్ధాలు వస్తాయో లేదో తెలీదు కానీ (వీధి నల్లాల దగ్గర ఎప్పుడో మొదలైనాయి) తప్పకుండా వచ్చే ప్రమాదం పొంచి ఉంది.

ఒక మనిషి తిండి లేకుండా దాదాపు ఒక నెలవరకు ఉంటాడేమో కానీ, నీరు లేకుండా 4 లేదా 5 రోజులు కూడా ఉండలేడు. నల్లాల నుంచి ఒక్కొక్క చుక్కే పడుతుంది కదా అని మనం అనుకుంటే రోజుకి 75 లీటర్ల నీరు అంటే దాదాపు 35 నుండి 40 మందికి ఒకరోజు త్రాగడానికి సరిపడే నీరు వృధా అవుతోందన్నమాట.

రేపు మన పిల్లలకి ప్రధానంగా ఇవ్వాల్సింది స్థిరాస్తులు, చరాస్తులు కాదు - నీరు, సమతుల్యమైన పర్యావరణం.

'పల్లెసృజన' తరుపున ప్రపంచ వాటర్‌డే సందర్భంగా నీటికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు మీముందుంచుతున్నాం. నీటి వాడకం గురించి కొన్ని ఆశ్చర్యకరమైన నిజాలు ఈ క్రింద పొందుపరిచాం.

| క్ర. | వస్తువు | అవసరమయ్యే నీరు ప్రపంచ సగటు (లీటర్లు) |
|---|---|---|
| 1 | బీట్ పంచదార 1 కేజి | 920 |
| 2 | చెరుకు పంచదార 1 కేజి | 1,930 |
| 3. | ఒక కప్పు టీ | 120 కప్పుల నీరు |
| 4. | ఒక పెద్ద టమోట (250 గ్రా.) | 50 |
| 5. | ఒక గ్లాసు వైను (125 మి.లీ.) | 110 |
| 6. | ఒక పెద్ద ఆపిల్ (150 గ్రా.) | 125 |
| 7. | ఒక అరటి పండు (200 గ్రా.) | 160 |
| 8. | ఒక గ్లాసు బీరు | 74 |
| 9. | బ్రెడ్డు (1 కేజి) | 1,068 |
| 10. | వెన్న (1 కేజి) | 5,550 |
| 11. | క్యాబేజి (1 కిలో) | 280 |
| 12. | చాక్లెట్ (1 కేజి) | 17,000 |
| 13. | కాఫీ (ఒక కప్పు) | 130 |
| 14. | దోస/గుమ్మడి (1 కిలో) | 350 |
| 15. | కర్జూరం (1 కిలో) | 2,280 |
| 16. | ఒక గుడ్డు | 200 |
| 17. | వేరుశనగ (1 కిలో) | 2,780 |
| 18. | జొన్న (1 కిలో) | 1,220 |
| 19. | మామిడి (1 కిలో) భారత్ | 1,910 |
| | ,, చైనా | 1,440 |
| | ,, థాయ్‌లాండ్ | 2,860 |
| 20. | పాలు (1 కిలో) | 1,020 |
| 21. | పాలపొడి (1 కిలో) | 3,750 |
| 22. | ఆవుపాలు (1 కిలో) | 940 |
| 23. | నారింజ (1) | 80 |
| 24. | పాస్తా | 1,850 |
| 25. | ఫిజ్జా (725 గ్రా.) | 1,260 |
| 27. | ఆలుగడ్డ (1 కిలో) | 290 |
| 28. | వరి | 1,670 |
| 29. | బియ్యం | 2.500 |
| 30. | ఆలుగడ్డ చిప్స్ | 1,040 |
| 31. | గొర్రె మాంసం (1 కిలో) | 1,400 |
| 32. | మేక మాంసం (1 కిలో) | 5,520 |
| 33. | సోయాబీన్ బయోడీజిల్ (లీ.) | 11,400 |
| 34. | చెరుకు బయో డీజిల్ (1లీ) | 2,107 |
| 35. | పంది మాంసం | 5,990 |
| 36. | ఒక చిన్న కారు టైరు | 1960 |
| 37. | ఒక చిన్నసైజు కారు | 1,48,000 |
| 38. | ఒక కిలో గొడ్డు మాంసం (బీఫ్) | 50,000 |
| 39. | ఒక కిలో ప్లాస్టిక్ | 200 |
| 40. | ఒక కిలో గోధుమ | 750 |
| 41. | ఒక కిలో ఉప్పు | 237 |
| 42. | ఒక కిలో ఉన్ని | 1,70,000 |

ఇప్పుడు మనకి కావలసినంత నీరు (ఉందా?) ఉందని అనుకోకుండా నీటిని వ్యవసాయంలో, పరిశ్రమల్లో, గృహావసరాల్లో ఎలా పొదుపు చేయవచ్చునో మీరూ ఆలోచించి, మీ ఆలోచనలని మాకు పంపండి. వాటిని మా పల్లెసృజనలో ప్రచురించి నీటి వాడకంలో పొదుపు గురించి ఇతరులకు కూడా తెలియజేద్దాం.

**గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక**

**పల్లెసృజన**

ను మీ వేదికగా ఉపయోగించుకోవాలనుకుంటున్నారా?

**మీ ఆలోచన ఎంత చిన్నది అయినా సరే మేము ఆహ్వానిస్తాం**

**వెంటనే పంపండి**

*- సంపాదకవర్గం*

# క్రీ.శ. 2070 నుండి 2012
# భవిష్యత్తు నుండి వర్తమానానికి....

**ప్రియమైన తోటి మానవులారా!**

ఇది 2070వ సంవత్సరం నాకీ మధ్యనే 50 సంవత్సరాలు నిండాయి, కానీ 85 సంవత్సరాల వాడిలా కనిపిస్తాను.

చాలా తక్కువ నీరు తాగుతాను కనుక ప్రమాదకరమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాను. ఇంక ఎక్కువ కాలం బ్రతకను. ఇప్పుడున్న సమాజంలో నేనే వయసు మళ్ళినవాణ్ణి నాకు బాగా గుర్తు 5 సంవత్సరాల వయసున్నప్పుడు పరిస్థితులు చాలా వేరుగా ఉండేవి. ఎన్నో ఉద్యాన వనావనాలుండేవి, ఇళ్ళముందు చిన్నచిన్న తోటలుండేవి.... మేము మా ఇళ్ళల్లో గంటలకొద్దీ స్నానాలు చేసేవాళ్ళం. ఇప్పుడు చిన్న చిన్న మినరల్ ఆయిల్ తడిపిన బట్టలతో ఒళ్ళు తుడుచుకుంటున్నాం. ఆ కాలంలో స్త్రీలకి అందమైన పెద్ద జడలుండేవి. ఇప్పుడు నీళ్ళు లేక గుండు చేయించు కుంటున్నారు. అప్పుడు మా నాన్న నీళ్ళపైపుతో తన కారు శుభ్రం చేసుకునేవాడు. ఇప్పుడది చెప్పినా నా పిల్లలు నమ్మటం లేదు. చాలాసార్లు నీటిని వృధా చేయొద్దు అన్న హెచ్చరికను చేసేవారు, కానీ మేము పట్టించుకోలేదు. నీరేకదా పుష్కలంగా ఉంది అనుకునేవాళ్ళం. ఇప్పుడు నీటి వనరులన్నీ ఇంకిపోయాయి, లేదా కలుషితమైపోయాయి. ఎటు చూసినా ఎడారిని తలపింపజేస్తుంది.

జీర్ణకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, మూత్ర సంబంధ వ్యాధులు ఇప్పుడు ఎక్కువ చావులకి కారణమవుతున్నాయి. పరిశ్రమలన్నీ మూతపడ్డాయి, ఎక్కడా ఉద్యోగాలు లేవు. డీశాలినేషన్ పరిశ్రమే అన్నిటికన్నా పెద్ద పరిశ్రమ. అక్కడ జీతానికి బదులు త్రాగటానికి గ్లాసు నీళ్ళిస్తారు. వీధిలో నీళ్ళకని దొంగతనాలు, హత్యలు చేసుకుంటున్నారు. 80 శాతం తిండి కృత్రిమమైనదే. ఆ కాలంలో ప్రతి మనిషి రోజుకి కనీసం 8 గ్లాసుల నీరు త్రాగాలని చెప్పేవాళ్ళు. ఇప్పుడు కష్టంమీద రోజుకి అరగ్లాసు నీళ్ళు మాత్రమే దొరుకుతున్నాయి. బట్టలు ఉతకలేం కనుక వాడినవి పడేస్తాం. చెత్త పెరిగిపోతోంది..... నీళ్ళు లేవు కనుక సెప్టిక్ ట్యాంకు పద్ధతే వాడుతున్నారు. మనుషులు సన్నగా, ఎముకలు బైటపడి ఎండిపోయిన అస్థిపంజరాల్లా ఉంటారు. ఓజోన్‌పొర రక్షణ లేక రోగాల బారినపడి ఒళ్ళంతా పుళ్ళతో, చర్మవ్యాధులతో ఉంటారు. 20 సంవత్సరాల యువతి 40 సంవత్సరాల ప్రౌఢలా కన్పిస్తుంది. శాస్త్రవేత్తలు ఎన్నో ప్రయోగాలు చేస్తూ వున్నారు, కానీ నీళ్ళని సృష్టించలేక పోతున్నారు. కనుచూపు మేరలో.... సమీప భవిష్యత్తులో పరిష్కారం కనిపించడం లేదు. చెట్లు లేక ప్రాణవాయువు తగ్గిపోయింది. ప్రజల్లో తెలివి, చురుకుదనం లేదు. పిల్లలు వికలాంగులుగా, అష్టావక్రులుగా పుడుతున్నారు. ప్రభుత్వం పీల్చే గాలికి పన్ను వేస్తోంది. పన్ను కట్టనివారిని పెద్ద బ్లోయర్స్ వున్న వెంటిలేటెడ్ ప్రాంతాలకి తరిమేస్తారు. అక్కడ సోలార్ పవర్‌తో మెకానికల్ లంగ్స్ పనిచేస్తాయి. మంచి గాలి రాదు. ఏదో గాలి పీల్చి బతికేస్తాం. ఇప్పుడు మనిషి సగటు జీవితం 35 సంవత్సరాలు.

కొన్ని బలమైన దేశాలు చిన్న సెలయేళ్ళున్న చిన్న దేశాలను ఆక్రమించుకొని వాటికి మిలటరీ పహారా పెట్టారు. 'నీరు' అన్నది బంగారం, వజ్రాలకన్నా విలువైన వస్తువుగా మారిపోయింది. చెట్లు లేవు కనుక వర్షం రాదు. వచ్చినా ఆమ్ల వర్షం వస్తుంది. అది మేలుకన్నా కీడే ఎక్కువ చేస్తుంది. ఇప్పుడు వేర్వేరు ఋతువులు లేవు. ఒకటే కాలం 'ఎండాకాలం'. అప్పుడు పర్యావరణాన్ని రక్షించుకోండి ఎవరెంత చెప్పినా వినిపించుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తున్నాం. నా చిన్నతనం గురించి చెప్పుకుంటే అడవులు, చెట్లు, పూలు, వాటి సుగంధం, వాన, గుండెనిండా గాలి పీలిస్తే ఎంత ఆనందంగా ఉండేదో ....... చెరువులు, సెలయేళ్ళు, ఎంతకావాలన్నా తాగడానికి నీళ్ళు, అప్పుడు మనుషులు ఎంత ఆరోగ్యంగా ఉండేవారో..... చెప్తూ ఉంటే నా కూతురు నోరెళ్ళబెట్టి చూస్తూ ఒక చిన్న ప్రశ్న వేసింది. "నాన్నా మనకిప్పుడు నీళ్ళు ఎందుకు లేవు? " అని. సమాధానం చెప్పలేకపోయాను. నా గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు అనిపించింది. నేను ద్రోహిని....... ఎందుకంటే నేను ఏదైనా చేయగలిగి ఉండికూడా ఏమీ చేయని తరానికి చెందినవాన్ని. పర్యావరణం నాశనమవటంలో నేనూ భాగస్వామిని. ఎవ్వరూ పట్టించుకోలేదు అందరం మేమం దరం ఏమీ చేయలేదు. మాకెందుకని ఊరుకున్నాం. ఇప్పుడు దాని ఫలితం మా పిల్లలు అనుభవిస్తున్నారు.

నిజం చెప్పాలంటే ఈ భూమ్మీద జీవజాలం ఎంతోకాలం మన్నలేదు. కారణం ప్రకృతి నాశనం పరాకాష్టకు చేరుకుంది. ఇక్కడినుంచి తిరుగు ప్రయాణం లేదు. కాలంలో వెనక్కి వెళ్ళి ఈ సమస్య గురించి మనవాళ్ళకి చెప్పాలని నేనెంత మదన పడతానో. అప్పుడు చేయగలిగిన అవకాశం వున్నా ఏమీ చేయకుండా ఉండిపోయాము. భవిష్యత్తుని రక్షించుకోలేక పోయాము. ఈ పై సందేశాన్ని మీకు పరిచయమున్న వాళ్ళందరికీ తెలియ జేయండి, పర్యావరణం, నీటి పరిరక్షణ గురించి అవగాహన కల్పించండి.

ఇది ఆట కాదు. కథ అంతకన్నా కాదు. నిజం.... నిఖార్సయిన నిజం...... మీ పిల్లలకోసం చేయండి..... మీకిప్పుడు పిల్లలు లేకపోయినా ముందుముందు వస్తారు.

ఈ నరకాన్ని వారికి వారసత్వంగా ఇవ్వకండి. వారికి జీవితాన్నివ్వండి.

**ఫ్రెంచి పత్రిక "క్రానికా దె లో టియంపో" ఏప్రిల్ 2002లో ప్రచురించిన వ్యాసం ఆధారంగా.....**




# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు



(ఈ క్రింది ఆచారాలు, వాడుకలను గుజరాత్‌లోని నర్మదా జిల్లా 'దేదియాపాడ' ప్రాంతంలోని వేర్వేరు గ్రామాల నుంచి 'సృష్టి' వాలంటీర్ 'ప్రేమ్‌సింగ్ వాసవా' అందజేశారు.)

**221201**

## తామర వ్యాధి (అతి దురద) నయం చేయాలంటే....




గుజరాత్‌కు చెందిన ఉగ్రాభాయ్ దుంగేరియా భాయ్ వాస్వా తామర జబ్బు నుండి విముక్తికి ఈ క్రింది చిట్కా అందజేస్తున్నారు. మోదుగ గింజలు వేప ఆకుల రసంతో ఆయన వైద్యం చేస్తూ ఉంటారు. తామర వ్యాధి సోకిన ప్రాంతానికి కావలసినంత మోతాదులో మోదుగ విత్తనాలు, వేపాకును కలిపి ముద్ద చేసి వ్యాధి ఉన్న ప్రాంతంలో పూస్తే మంచి ఫలితం ఉంటుంది అంటున్నారాయన.


**221202**

## వాపుల నివారణకి ఏలుమద్ది (తెల్లమద్ది) తో చికిత్స....

దెబ్బలవల్ల కానీ, బెణకడం వల్ల కానీ వాపు వస్తే దానిని తగ్గించటానికై మధుసింగ్ హుందియా ఈ క్రింది చిట్కా ఉపయోగిస్తున్నాడు. అర్జున వృక్షం / ఏరుమద్ది చెట్టు ఆకులని బాగా మెత్తగా రుబ్బి దానిని వాపువున్న భాగంలో పట్టించి శుభ్రమైన గుడ్డతో కట్టు కట్టాలి. ప్రతి రెండు రోజుల కొకసారి కట్టు మార్చాలి. పశువులకి 5 రోజుల్లో మంచి గుణం కనిపిస్తుంది అంటారాయన.



## 221203 విషాహారానికి ఆముదంతో విరుగుడు....




గుజరాత్‌కు చెందిన అనిల్‌భాయ్, మహేష్ భాయ్ పశువులకి విషాహారం తిన్నా, విషపు పురుగు కుట్టినా విరుగుడుకై లేత ఆముదపు చెట్టు ఆకుల రసాన్ని తగినంత తాగిస్తే మంచి ఫలితం ఉంటుంది అంటున్నారు.

## 221204 పశువులలో పుండ్లకి పురుగులు పడితే చికిత్స

పశువులకి పుండ్లు పడి పురుగులు చేరినా లేదా పేగులలో పురుగులు చేరినా గుమాభాయ్ గమ్‌భాయ్ చక్కని చిట్కాతో నయం చేస్తానని చెపుతున్నారు. తరిగిశ ఆకుల రసంతో అంతే ప్రమాణంలో మజ్జిగ, 10 గ్రా. గంధకము (అగ్గిపుల్లల నుండి తీసినది), 5 గ్రా. ఇంగువ కలిపి జబ్బు వున్న పశువులకి ఉదయంపూట తినిపిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది అంటారాయన.


## 221205 పశువులకి వడదెబ్బ సోకినప్పుడు ....

తీవ్రమైన ఎండా కాలంలో పశువులకి వడ దెబ్బ తగలటం సహజం. దీనికి విరుగుడుగా గుజరాత్ లోని రసిక్‌భాయ్ దిల్‌షుక్ భాయ్ తామరాకు విత్తనాలు వాడుతారు. ఆయన ఈ తామర చెట్టు విత్తనాలను దంచి, నీటిలో కలిపి వడదెబ్బ కొట్టిన పశువుచే తాగిస్తారు. దీనివలన పశువులకు వడదెబ్బ కొట్టటం వలన సంభవించే తడి ఆరిపోవటం, విరోచనాలు రావటం లాంటి వాటినుండి కూడా కాపాడుతుంది అని చెప్తారాయన.



### 221206 తేలు కుట్టినప్పుడు.....

పల్లెటూళ్ళలో పశువులకి తేలు కుట్టడం సహజంగా జరుగుతూ వుంటుంది. దానికి గుజరాత్‌కు చెందిన 'కతూరియాభాయ్ దేవ్‌నా' ఒక మూలికా వైద్యం ఉపయోగిస్తారు. ఆయన ఉత్తరేణిమొక్క వేళ్ళని కొద్దిగా నీళ్ళతో కలిపి బాగా రుబ్బి దానిని తేలుకుట్టిన భాగంలో పూస్తాడు. దీంతో పశువుకి వెంటనే ఉపశమనం లభిస్తుంది.



ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో కొందరు పాము, తేళ్ళు, పురుగులు కుట్టినప్పుడు ఆ విషానికి విరుగుడు శక్తికల ఉత్తరేణి వేళ్ళని వాడుతారని తెలుస్తోంది.

### 221207 దగ్గు, జ్వరం నుండి ఉపశమనం కొరకు.....

గుజరాత్‌కు చెందిన 'భావ్‌భాయ్ దుంగేరియా' జలుబు, దగ్గు, జ్వరం నుండి ఉపశమనానికి మంచి చిట్కా వైద్యం వాడుతూ ఉంటారు. ఆయన ముందుగా 500 గ్రా. తుమ్మి పూలు, బాగా కడిగి శుభ్రం చేసి ఉంచుకుంటారు. తరువాత మూకుడులో ఒక టేబుల్ స్పూనంత నూనె వేసి, వేడి అయ్యాక చిటికెడు ఇంగువ, సగం టీస్పూను ఆవాలు వేసి వేగిన తర్వాత దానిలో శుభ్రం చేసిన తుమ్మిపూలు, కొంచెం ఉప్పు, పసుపు, మిరియాల పొడి వేసి బాగా ఉడికిన తర్వాత రొట్టెలతో కలిపి తినమంటాడు. దీనితో దగ్గు, సలపరింత, జలుబు చిటికెలో పోతాయని చెపుతారాయన.

మన ఇళ్ళల్లో కూడా పెద్ద తుమ్మి రసాన్ని దగ్గు జలుబులకు వాడటం రివాజుగా చూస్తున్నాం.


### 221208 పశువులలో ఎక్కువ పాలు పడటానికి....

గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లాలో కల జమ్‌కొండోర్న గ్రామానికి చెందిన 'కీర్తిభాయ్ నంజీభాయ్ బబారియా' పశువులు పాలు ఎక్కువగా ఇవ్వటానికి ఈ క్రింది పద్ధతిని ఉపయోగిస్తారు. ఆయన పశువులకు పెట్టే దాణాలో సంస్కృతం లో చంద్రశూర, తెలుగులో అడియాలు, అదేలు, ఆదిత్యాలు అని పిలిచే గింజలు కలిపి తినిపిస్తారు. దానితో పశువులు మామూలుకన్నా ఎక్కువ పాలు ఇస్తున్నాయట.



### 221209 విరిగిన ఎముకలు అతుక్కోవటానికి.....


గుజరాత్‌కు చెందిన 'హర్షక్‌భాయ్ పోఖ్యా' విరిగిన ఎముకలు కట్టుకోవటానికి ఈ క్రింది వైద్యం ఉపయోగిస్తూ ఉంటారు. తంగేడు చెట్టు ఆకులు, చింతపండు సమపాళ్ళలో తీసుకొని రుబ్బి ఆ మిశ్రమంలో కొంచెం వంటసోడా కలిపి దానిని ఎముకలు విరిగినచోట పట్టించి కట్టు కడతాడు. నాలుగు రోజుల్లో కట్టు తీసేస్తారు. అప్పటికి విరిగిన ఎముక అతుక్కుపోయి ఉంటుంది.



### ఒడిస్సా రాష్ట్రం నుండి కొన్ని చిట్కాలు :


### 221211 కాలి పగుళ్ళకు మందు....

చలికాలంలో పొడి వాతావరణం కారణంగా కాలి వేళ్ళు, మడమలు పగలటం, ఫలితంగా నడిచేటపుడు రక్తం వచ్చి చాలా బాధ కలిగిస్తూ ఉంటాయి. ఒడిస్సా రాష్ట్రంలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాకు చెందిన రైతులు దీనికొక మంచి వైద్యం వాడుతూ ఉంటారు. వారు వెల్లుల్లిపాయలను నీటితో కలపకుండా దంచి ఆ ముద్దని కొంచెం వేడి చేసి, పగిలిన భాగాలకు పూస్తారు. ఇది రాత్రి పడుకోబోయే ముందు చేస్తారు. ఈ విధంగా మూడు నాలుగు రోజులు చేస్తే పగుళ్ళు నయమైపోతాయట!



### 221212 చక్కని నిద్రకోసం......

రైతులు చాలా రోజులు వరుసగా రోజంతా శ్రమించి పని చేయటం వలన అలసి పోతారు. ఇలా నెలలో చాలా రోజులు చేయాల్సి వస్తే వాళ్ళకు రాత్రుల్లో నిద్ర సరిగా పట్టక ఇబ్బంది పడుతూ ఉంటారు. ఒడిస్సా ప్రాంతంలోని రైతులు అలసట, నిద్రలేమినుండి తమను తాము కాపాడుకోవటం కోసం జీలకర్ర, అరటిపండ్లని వాడుతారు. వారు జీలకర్రని



వేయించి, మెత్తగా పొడి కొట్టి ఉంచుకుంటారు. బాగా పండిన అరటి పండులో ఒక చెంచా ఈ వేయించి దంచిన జీలకర్ర పొడిని దంచి కలిపి అలసి పోయినవారికి ఇస్తూ ఉంటారు. దీనితో వాళ్ళు తిరిగి శక్తివంతు లవటమే కాక, రాత్రులలో చక్కని నిద్ర పోగలుగుతూ ఉంటారు.

### 221213 తల రుద్దుకోవటానికి సహజమైన షాంపు



ఒడిస్సా రాష్ట్రంలో పూర్వంలాగా స్త్రీ పురుషులు ఇప్పటికీ తల రుద్దుకోవటానికి సహజసిద్ధమైన షాంపూ వాడుతూ ఉంటారట. వారు బెండ చెట్టు ఆకులను ఇప్పటికీ దీనికై వాడుతారు. వారు ఈ ఆకులను సేకరించి, మెత్తగా దంచి తలకి పట్టిస్తారు. కొంచెం ఆరిన తర్వాత నీళ్ళతో కడిగేస్తారు. దీనివలన తల, వెంట్రుకలు శుభ్రంగా ఉండటమే కాక, మెదడు కూడా చల్లగా ఉంటుంది అని చెపుతున్నారు కంటపాడ గ్రామానికి చెందిన 80 సంవత్సరాల వయస్సున్న రైతు 'ధనేశ్వర్ ప్రధాన్'.

### 221214 చెదల నివారణకు.....

ఒడిస్సా రాష్ట్రంలోని మెండసాల ప్రాంతంలోని రైతులు పొలాల్లో చెదలను నివారించటానికి ఈ క్రింది పద్ధతిని వాడుతూ ఉంటారని 'హరిహర్ సామంత్రే' తెలియ జేస్తున్నారు. ఒక కిలో వేపాకులకి అంతే ప్రమాణంలో మేకపెంటికలు కలిపి పొడి చేసి పొలాల్లో చల్లుతారట. ఎకరానికి 100 కిలోల మిశ్రమం చల్లాల్సి వుంటుందని, తాను గత 40 సంవత్సరాల నుండి ఇదేవిధంగా చేస్తున్నాను అంటున్నారాయన.

### 221215 కూరగాయల దిగుబడి పెరగటానికి .....

గుమ్మడి, వంకాయలు, నేతిబీర లాంటి కూరగాయల దిగుబడి పెరగటానికి ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ జిల్లా, బారంగా ప్రాంత రైతులు స్థానికంగా జూనాపాని అని పిలిచే ఒక ద్రావకాన్ని వాడతారు. దానిని వారు 100 వామును ఒక లీటరు నీటిలో రాత్రంతా నానబెట్టి, వడకట్టి ఆ ద్రావకాన్ని చెట్లపై పిచికారి చేస్తారు. దీనివలన పంట దిగుబడి దాదాపు రెండింతలవుతుందని అంటున్నారు 'కిషోర్ సాహూ'. ఆయన ఈ పద్ధతిని తన తండ్రి పదన్ సాహూ వద్ద నేర్చుకున్నాడు. తన తండ్రి ఈ పద్ధతిని దాదాపు 30 సంవత్సరాల నుంచి వాడుతున్నారని, ఆయన ఈ ద్రావకాన్ని ఎక్కువ మొత్తంలో తయారు చేసి తోటి రైతులకు ఉచితంగా ఇచ్చేవారని అన్నారాయన.

### 221216 పశువులలో పిరుదుల నివారణకు .....

పశువులకు పిరుదులు పట్టడం సాధారణంగా జరుగుతూ వుంటుంది. అవి పశువులను పట్టి రక్తం పీల్చేసి వాటిని రక్తహీనంగా చేస్తాయి. ఒడిస్సా ప్రాంతంలోని కోల్హా ఆదివాసి తెగకి చెందిన రైతులు ఉత్తరేణి/ కుకురుదంతి వేళ్ళని పశువుల మెడకి దండలా కడతారు. దీనితో పిరుదులు పశువుల జోలికి రావు.



### 221217 పశువులకు గాయాలను నయం చేయటానికి

ఒడిస్సా రాష్ట్రంలోని కోల్హా ఆదివాసి తెగకి చెందిన రైతులు స్థానికంగా ధనువాలంక అని పిలిచే మిరపకాయలు పశువులకయ్యే గాయాలను నయం చేయటానికి వాడతారు. మన తెలుగులో గోల్కొండ మిరప అని పిలువబడే మిరపకాయలని 25 నుంచి 50 వరకు తీసుకుని, వాటిని మెత్తగా నూరి పశువులకి గాయాలైన చోట పూస్తే గాయం త్వరగా



### 221218 పౌల్ట్రీ కోళ్ళలో రణీఖేత్ జబ్బుకి చికిత్స .....

పౌల్ట్రీ కోళ్ళలో 'రణీఖేత్' అనే అంటువ్యాధి వస్తూ వుంటుంది. సరైన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొనకపోతే కోళ్ళు చనిపోయి చాలా నష్టం వాటిల్లుతుంది. ఒడిస్సా రాష్ట్రంలోని ఆదివాసి రైతులు ఈ వ్యాధినుండి తమ కోళ్ళను రక్షించుకోవటానికి వాటికి వేయించిన ఉల్లిపాయలు తినిపిస్తారట. ప్రతి 6 నెలలకోసారి ఇలా తినిపిస్తే కోళ్ళు ఈ జబ్బు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాయి. తాము గత ఆరు సంవత్సరాలనుండి ఈ పద్ధతిని వాడుతున్నామని చెప్తున్నారు రాజేంద్రనాయక్ అనే రైతు.

### 221219 ఎద్దులకి అలసట నుండి విముక్తికై .....


ఒడిస్సా రాష్ట్రంలోని రాయిరాకోల్ ప్రాంతంలోని రైతులు పశువులు అలసిపోతే వాటికి ఉత్సాహం కలిగించటానికై ఒక చిట్కా వాడతారట. ఇందుకై వారు గుప్పెడు ఇప్ప పూలు తీసుకుని వాటిని అరకేజి ఉలవలతో కలిపి నీటిలో కొన్ని గంటలపాటు నానబెట్టి ఆ మిశ్రమాన్ని తర్వాత ఉడకబెడతారు. దీనిని అలసిన ఎడ్లకి ఇస్తే అవి శక్తివంతమై ఉత్సాహంగా పనిచేస్తాయి అని చెపుతున్నారు 'బాదబహాల్' గ్రామానికి చెందిన రైతు సదానంద్ ప్రధాన్. ఈ మిశ్రమం ప్రత్యేకించి పశువులకి వానాకాలంలో ఇస్తూ ఉంటార!

### 221222 పంటలు ఆరోగ్యంగా పెరగాలంటే .....

తమిళనాడులో ఈ చిట్కాను ఉపయోగిస్తూ వుంటారు. ఒక కిలో నిమ్మరసంలో 8 గుడ్ల సొనను ఒక జాడిలో కలుపుతారు. దానిని వారు 8 రోజులపాటు మురగనిచ్చిన తర్వాత దానిలో ఒక కిలో బెల్లం కలిపి మూత బిగించి మూడు వారాల పాటు అలాగే ఉంచుతారు. మూడు వారాల తర్వాత ఆ మిశ్రమాన్ని వడకడ్తారు. 200 మి.లీ. మిశ్రమంలో 10 లీటర్ల నీటిని కలిపి పొలంలో పిచికారి చేస్తారు. దీనివలన పంట ఏపుగా ఆరోగ్యంగా పెరగటమే కాక, పూలు, కూరగాయల దిగుబడి కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతుంది.

ఈ మిశ్రమాన్ని పంచగవ్య ద్రావకంతో కలిపి వాడితే మంచి ఫలితాలు సాధించానని, తాను పండించిన టమోటాల బరువు కూడా పెరిగిందని, ఇతర చెట్లు కూడా ఏపుగా పెరిగి, ఆకులు పచ్చగా నవనవలాడుతూ ఉన్నాయని చెప్తున్నారు 'అలగేశన్'.

### 221223 మేకలలో జబ్బుకి మందు .....



మేకలు సాధారణంగా వర్షాకాలంలో పచ్చగడ్డి అతిగా తినటం లేదా ఎక్కువ దాణా తినటం లేదా మేకపిల్లలు ఎక్కువ పాలు త్రాగటం వలన జబ్బు పడతాయి. ఈ రోగానికి చెప్పుకోదగ్గ లక్షణాలు ఏమీ లేకుండానే మేకలు చనిపోతాయి. సాధారణంగా రోగలక్షణాలు.... మేకలు అతిగా అరవటం, బద్దకంగా ఉండటం, వాటికి పొత్తికడుపులో నొప్పి రావటం, తల వెనక్కి ఎగరేసి అరవటం లేదా రక్త విరోచనాలు కావటం లాంటివి. ఈమధ్యనే తమిళనాడులోని రామనంతపురంలో ఈ వ్యాధి సోకి 110 మేకలు ఒకేసారి చనిపోయాయి. అప్పుడు రాజమాణిక్యం అనే మూలికావైద్యుడు మిగిలిన మేకలకి పచ్చి వంకాయలు కాల్చి ఒక్కొక్క మేకకి నాలుగు వంకాయల చొప్పున తినిపించాడట. దానితో అవి బ్రతికిపోయాయి. అతను ఇదివరలో ఆవులకి విరోచనాలు వచ్చినపుడు వాటికి ఒక కిలో కాల్చిన వంకయలు తినిపించి వైద్యం చేసి నయం చేశాడట.

### 221228 పశువులలో గర్భస్థ మావి రక్షణకై .....

తమిళనాడు మధురై జిల్లాలోని వడైపట్టి ప్రాంతంలోని మల్లిపట్టం గ్రామానికి చెందిన 'ముత్తు పిళ్ళై' పశువులలో గర్భస్థ మావి రక్షణకై వాటికి ఒక కిలో నూనె తీసివేసిన నువ్వుల ముద్ద (నువ్వుల గానుగ చెక్క) లో ఒక కిలో బెల్లం కలిపి, ఉడకబెట్టి ఆరు ఉండలుగా చేసి రెండుసార్లు తినిపిస్తే మంచి ఫలితం ఉంటుందని చెపుతున్నారు. ఇదేవిధంగా మరొక పద్ధతిలో ఒక కిలో బియ్యం పిండిలో ఒక కిలో బెల్లం కలిపి ఉడకబెట్టి ముద్దలుగా చేసి తినిపించినా మంచి ఫలితం ఉంటుందని చెపుతున్నారు.

**20202 పశువులలో సాలె పురుగు కాటుకు మందు....**

గుజరాత్‌లోని బరోడా జిల్లాకు చెందిన మోహన్‌భాయ్ పటాలియాభాయ్ రత్వా కి జంతువులంటే చాలా ఇష్టం. పైగా అతనికి మూలికా వైద్యం కూడా తెలుసు. ఆవులకి సాలీడు కాటువలన వణుకు, జ్వరం, పక్షవాతం లాంటి లక్షణాలు వస్తాయి. దానికాయన చింతపండు పులుసును దూదితో సాలీడు కుట్టిన ప్రదేశంలో పూస్తాడు. దానితో మంచి ఉపశమనం కలుగుతుంది అంటాడాయన.

**20203 పశువులలో విరోచనాలకి మందు.....**

గుజరాత్‌లోని పంచ్‌మహల్ జిల్లాకు చెందిన రాంసింగ్ సీతాభాయ్ భూరియా పశువులకు వచ్చే విరోచనాలను తగ్గించటానికి ఒక మందు వాడుతూ ఉంటారు. ఆయన నల్లసుంద్ర, మోదుగ, జారుమామిడి చెట్ల వ్రేళ్ళను పొడి చేసి ఈ మూడింటిని ఒక్కొక్కటి 250 గ్రా. పొడిని ఒక లీటరు నీటిలో సుమారు రెండు గంటలు మరుగబెట్టి వడకట్టి ఆ ద్రావకాన్ని పశువులకి తగ్గేదాకా రోజుకు మూడుసార్లు తాగిస్తాడు.

**20206 గేదెల్లో గర్భసంచి జారితే....**

తమిళనాడులోని ఈరోడ్ జిల్లాకు చెందిన మారప్ప గౌండేర్ ఆ ప్రాంతంలోని పశువులకి మూలికా వైద్యం చేస్తూవుంటాడు. తోటి మూలికా వైద్యులతో కలిసి చర్చించి, అనేక కొత్తమందులు కనిపెట్టాడు. గేదెల్లో గర్భసంచి జారిపోయినపుడు ఆయన ముందు దానిని శుభ్రమైన నీటితో కడిగి దానిపై 100 గ్రా. చెరుకు రసం చల్లి జాగ్రత్తగా లోపలికి నెట్టివేస్తాడు. తర్వాత ఆ గేదెకి అప్పుడే తెంపిన 500 గ్రా. నిద్రకంటి చెట్టు ఆకులను ఒకటి రెండు రోజులు తినిపిస్తాడు. గేదె వెనకభాగం ఎత్తుగా ఉండేలా పాకలో తగ్గ ఏర్పాట్లు చేస్తాడు. దాంతో ఆ పశువుకు మంచి ఉపశమనం కలుగుతుందట!

**20207 పశువులలో కడుపు ఉబ్బసం వ్యాధికి మందు......**

పశువులకు కడుపు ఉబ్బసం వ్యాధి సోకినప్పుడు ఊపిరి కూడా తీయటానికి చాలా కష్టపడతాయి. చేతితో తట్టితే డప్పు వాయించినట్లు శబ్దం వస్తుంది. తమిళనాడుకు చెందిన పాండురంగన్ దీనికి చికిత్సగా 25 గ్రా. నల్ల మిరియాలు, 20 గ్రా. మిరప, 20 గ్రా. ఊలమారె ఆకులను కలిపి నూరి, ముద్దగా చేసి, చిన్న గుళికలుగా చేసి పశువుకి రోజుకు మూడుసార్లు తినిపిస్తారు. దీనివల్ల మంచి ఫలితం ఉంటుంది అంటాడాయన.

**20211 గొర్రెల కాళ్ళు విరిగినప్పుడు......**

తమిళనాడుకి చెందిన కె. సెల్వరాజ్ తన జీవనోపాధికై 35 గొర్రెలను పెంచుకుంటున్నాడు. ఎప్పుడైనా ఏదైనా గొర్రె కాలు విరిగినపుడు ఆయన 200 గ్రా. చింతగింజలని నీటిలో 4 గంటలు నానబెట్టి వాటిని మెత్తగా నూరుతారు. తర్వాత ముద్ద అయ్యేంతవరకు ఉడకపెడతాడు. ఆ ముద్దని గొర్రె కాలు విరిగినచోట పట్టించి, కొబ్బరిపీచుతో కప్పి గట్టిగా కట్టుక కడతాడు. గొర్రెని ఎక్కువ కదలనివ్వకుండా 4 రోజులు చూసుకుంటాడు. అవసరమైతే ఇంకొకసారి ఇదే వైద్యాన్ని వాడతాడు. దీనితో విరిగిన కాలు త్వరగా అతుక్కుంటుంది అంటాడాయన.

**20212 మేకల కంటి వ్యాధికి చికిత్స.....**


తమిళనాడులో నివసించే కాళీరాజుకి 20 గొర్రెలు, 10 మేకలు ఉన్నాయి. వాటిలో దేనికైనా కంటిలో తెల్లమచ్చ వస్తే దానికొక మందు ఆయనే స్వంతంగా తయారుచేసి వాడతాడు. దానికాయన 100 గ్రా. తెల్లతుమ్మి ఆకులు, 10 గ్రా. నల్ల మిరియాలు, 50 గ్రా. మేకపాలు కలిపి, ముద్దగా నూరి ఆ ముద్దను వ్యాధి వచ్చిన కంటికి ఉదయం, సాయంత్రం పూస్తాడు. మంచి ఫలితాలు కావాలంటే ఇలా మూడురోజులు చేయాలి అంటాడాయన.

**20217 పశువులలో విరేచనాలకి మందు...**

ఒడిస్సా రాష్ట్రంలోని నారాయణ్‌ఘడ్ జిల్లాలో సారాంకుల్ ప్రాంతంలో నివసించే రైతులు పశువులకి విరోచనాలు వచ్చినప్పుడు గురివింద గింజలు నూరి, ఒక మోతాదు పశువులకి తినిపిస్తారు. దానివలన మంచి ఫలితం ఉంటుంది అంటారు.

**20218 పశువులలో కడుపు ఉబ్బటం జరిగితే....**

పశువుల పొట్టలో గ్యాస్ ఏర్పడినప్పుడు అవి చాలా ఇబ్బంది పడతాయి. దానికి ఒడిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాలోని దేంద్రగులి గ్రామానికి చెందిన బగబాన్ బహేరా అనే రైతు తెల్లమద్ది చెట్టు బెరడుని గోరువెచ్చని నీటిలో నానబెట్టి ఆ నీటిని పశువులచేత తాగిస్తాడు. దీనితో పశువులకి త్వీరగా ఉపశమనం కలుగుతుంది అంటాడాయన.



# 'హనీబీఏపి' ప్రగతి

'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్‌లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్త లతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. 2010లో శ్రీ జొన్నలగడ్డ శ్రీకర్ గారి ఆగమనంతో ప్రభుత్వ సంస్థలతో హనీబీఏపి అనుసంధానం ఇంకా బాగా పుంజుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ ఆరేళ్ళలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

✤ 92 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణ లను, ఆలోచనలను ఎన్ఐఎఫ్‌లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ ఆరుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్‌కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ ఇప్పటి వరకు 18 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ పంతొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఇన్నోవేషన్లను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్ మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ 2006 నుండి 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించటం, ఆరవ సంవత్సరం నుండి దీన్ని ద్వైమాసిక పత్రికగా మార్చటం.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.

✤ ఫోర్బ్స్ పత్రిక చింతకింది మల్లేశానికి అంతర్జాతీయ గుర్తింపుగా భారతదేశంలో అతి శక్తిశాలురైన ఏడుగురు గ్రామీణ ఇన్నోవేటర్లలో ఒకరిగా ఎన్నుకుంది.

✤ మే 25, 2011న నాబార్డు సంస్థలో తొమ్మిది మంది ఇన్నోవేటర్లు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని నాబార్డు సంస్థ, హనీబీఏపిల పరస్పర ప్రయత్నంతో జరిగింది. ఆర్థిక సహాయంతో ఈ ఇన్నోవేషన్లను సామాజికాబి వృద్ధికై మార్కెట్ చేయాలని నాబార్డు సంస్థ నిర్ణయించింది.

✤ 'పల్లెసృజన' ద్వారా గుంటూరు జిల్లావాసి సయ్యద్ సుభాని సృష్టించిన 'బూమ్ స్ప్రేయర్'ను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు 2012లో రికార్డుగా నమోదు చేయడమైనది.

✤ దూరదర్శన్ వారు జనవరి 2012 నుండి ప్రతినెలా నాలుగవ గురువారం రాత్రి 8 గంటలకు 'సప్తగిరి' ఛానల్‌లో 'సృజన' కార్యక్రమం ద్వారా ఇన్నోవేటర్లను పరిచయం చేయడం.

✤ అయిదవ జాతీయ పోటీల్లో బోయ రాజన్న, భూమయ్యాచారి, నజీర్ అహమ్మద్‌లకు జాతీయ బహుమతులు మార్చి 2012లో ప్రదానం. మా చిన్న కలలు నిజం కావడం.

✤ గోదాసు నర్సింహ గుర్రపుడెక్క యంత్రాన్ని ఉపయోగించ డానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ముందుకు రావడం, ఆరు లక్షల రూపాయల ఆర్డరు ఇవ్వడం.

**మా కలలు :**

✤ ఎనిమిదవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం ఆరుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తేవడం

✤ 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో-ఆర్డినేటర్, హనీబీఏపి, ఫోన్ : 98660 01678.

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్

# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

## అంగన్‌వాడి కేంద్రం

**పాఠకులకు నమస్సులు....**

- మనదేశంలో 1975లో సమీకృత శిశు అభివృద్ధి సేవల కార్యక్రమం మొదలు పెట్టారు.
- మహిళల-పిల్లల ఆరోగ్యానికి, అభివృద్ధికి ఈ కార్యక్రమం మొదలు పెట్టడమయినది.
- మనదేశంలో మహిళలు-పిల్లల కొరకు పనిచేసే ఇంత పెద్ద వ్యవస్థ ఏ దేశంలోను లేదు.
- ఈ సేవలను అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందిస్తారు.
- ప్రతి వేయి జనాభాకు ఒక అంగన్‌వాడి కేంద్రం ఉంటుంది. అంగన్‌వాడి కేంద్రం నిర్వాహకురాలును 'అంగన్‌వాడి టీచర్' అంటారు. ఈమెకు ఒక సహాయకురాలు ఉంటుంది. వీరిద్దరూ అంగన్‌వాడి కేంద్రం ఉండే గ్రామానికి సంబంధించినవారే.
- 0-6 సంవత్సరముల పిల్లలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా సేవలు అందిస్తారు.
- సార్వత్రిక వ్యాధినిరోధక టీకాలు పిల్లలకు ఇప్పించుటలో అంగన్‌వాడి టీచరు ఎ.యన్.యం.కు తోడ్పాటు ఇస్తుంది.
- గర్భవతుల నమోదు, వారికి పరీక్షలు, ప్రసవానంతర సేవలు అంగన్‌వాడి కేంద్రం అందిస్తుంది.
- అంగన్‌వాడి కేంద్రం పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ద్వారా నిర్వహిస్తారు.
- గ్రామీణ మహిళలకు ఆహారం, ఆరోగ్యం గురించి అవగాహన కలిగిస్తారు.
- 6 సంవత్సరముల లోపు పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యనందిస్తారు.
- పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి అంగన్‌వాడి కేంద్రాలు ప్రముఖ పాత్ర నిర్వహిస్తాయి. శిశు మరణాలు తగ్గించుటలో ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి.

## జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్

- మనదేశంలో 12-4-2005న మన గౌరవ ప్రధాని శ్రీ మన్మోహన్ సింగ్ జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ప్రారంభించారు.
- ఈ మిషన్ 7 సంవత్సరాల కార్యక్రమం. ఈ మిషన్ 2005 నుండి 2012 వరకు జరిగే కార్యక్రమం.
- గ్రామీణ ప్రాంతాలలో సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందించుటకు ఈ మిషన్ ప్రారంభించడమైనది.
- ఈ మిషన్‌లో దేశంలోని 18 రాష్ట్రాలను బలహీనమైన రాష్ట్రాలుగా గుర్తించారు. ప్రత్యేక శ్రద్ధ ఈ రాష్ట్రాలపై పెట్టారు.
- ఈ మిషన్ మొదలు పెట్టినప్పుడు ఆరోగ్యంపై ప్రభుత్వం పెట్టే ఖర్చును జి.డి.పి.లో 0.9 శాతం 2 లేదా 3 శాతానికి పెంచాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు 1.2 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నారు.
- శిశు మరణాలు తగ్గించాలనేది ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. ఆశించినంతగా ఫలితాలు రాలేదు.
- ఇప్పుడు మన గ్రామాల్లో 'ఆశ-అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్' అని పిలువబడే కార్యకర్త ఈ మిషన్ ప్రవేశ పెట్టిన కార్యక్రమంలో భాగమే.
- ప్రతి ఉప కేంద్రానికి సంవత్సరానికి ఒకసారి ఇచ్చే పదివేల రూపాయల 'అన్ టైడ్ ఫండ్స్' ఈ మిషన్ ద్వారానే వచ్చిన కార్యక్రమం.
- ఈ మిషన్ గ్రామాల్లో ఆరోగ్య, పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేసింది.
- ఈ మిషన్ మరల ఏ పేరుతో మార్పు చెందుతుందో వేచి చూద్దాం.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెన్నెముక లాంటిది.
- 1953లో మన దేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వ్యవస్థ మొదలైంది.
- 1983 జాతీయ ఆరోగ్య ప్రణాళిక సూచన ప్రకారం – గ్రామీణ ప్రాంతాలలో ప్రతి 30 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు ఆదివాసి, అటవీ ప్రాంతాలలో ప్రతి 20 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నెలకొల్పాలి.
- ప్రస్తుతం మనదేశంలో దాదాపు 23 వేల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నాయకుడు వైద్యాధికారి. వైద్యాధికారి పారా మెడికల్ సిబ్బంది మరియు నర్సింగ్ సిబ్మంది సహాయంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తారు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుటుంమ సంక్షేమ కార్యక్రమాలు, టీకాల కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, పాఠశాల విద్యార్తుల – ప్రభుత్వ హాస్టల్లలో విద్యార్థుల ఆరోగ్య రక్షణ మరియు వైద్య సేవలు అందిస్తుంది.
- 'రోమ్ ప్రోగ్రామ్'కు అనుబంధంగా వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు గ్రామీణ ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొనుటకు 2 లేక 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వైద్య కళాశాలలకు అనుబంధంగా పనిచేస్తాయి.
- ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ ఆరోగ్య కార్యక్రమం విజయవంతం కాదు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విజయానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలను భాగస్వామ్యం చేయాలి.
- 90 శాతం ఆరోగ్య సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల ముంగిటకు చేర్చవచ్చు.

## వైద్యరంగంలో మహానుభావులు-3

## ఆల్బెర్ట్ బ్రూస్ శాబిన్

- మనం పిల్లలకు వేసే పోలియో చుక్కల ముందును కనిపెట్టిన శాస్త్రవేత్త – ఆల్బెర్ట్ బ్రూస్ శాబిన్.
- మనదేశం జనవరి 13, 2012 నాటికి సంవత్సరం పాటు పోలియో రహిత దేవంగా ప్రయాణం సాగించింది.
- సాధారణ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, పల్స్ పోలియో టీకాల కార్యక్రమం ఈ స్థితికి రావటానికి మనం పాటించిన ప్రధాన అంశాలు.
- శాబిన్ ఆగస్టు 26, 1906న పుట్టారు. మార్చి 3, 1993న మరణించారు.
- శాబిన్ పోలండ్ దేశంలో జన్మించాడు. 1921లో అమెరికా దేశానికి పోయి, 1930లో అమెరికా పౌరసత్వం పొందాడు.
- 1931లో న్యూయార్క్ విశ్వ విద్యాలయం నుండి వైద్యంలో డిగ్రీ తీసుకున్నాడు.
- అంటువ్యాధులపై పరిశోధన శాబిన్‌కు అత్యంత ఇష్టం. మెదడువాపు వ్యాధికి టీకా కనిపెట్టడంలో తోడ్పాటునందించాడు.
- 1955 నుండి 1960 వరకు రష్యా శాస్త్రవేత్తలతో కలిసి నోటిద్వారా యిచ్చే పోలియో చుక్కల మందును కనిపెట్టుటకు పనిచేశారు.
- ఈ టీకా మందు నోటిద్వారా పిల్లలకు సులభంగా యివ్వవచ్చు. సామూహిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు నిర్వహించుటలో ఎంతగానో ఉపయోగపడింది.
- మార్చి 6, 2006న అమెరికా పోస్టల్ శాఖ శాబిన్ పేరిట ఒక పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. మనదేశం కూడా శాబిన్ పేరిట స్టాంపు విడుదల చేస్తే ఎంతో బాగుంటుంది.

ఈ అంశాలు ఒక నోటుపుస్తకంలో రాసిపెట్టండి, మీస్నేహితులతో, బంధువులతో,సహచరులతో మాట్లాడండి. వారికి పోస్టుకార్డులపై రాసి తెలపండి.

**– సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ..**

**డా. అరవీటి రామ యోగయ్య, ఓపియస్‌డిహెచ్.**

**ఫోన్ : 98496 69282**

# స్పందన

ఎడిటర్ గార్కి,

జనవరి– ఫిబ్రవరి సంచిక లోని సంపాదయకీయాన్ని చదివాను. నాకు బాగా నచ్చింది. మన దేశంలో వ్యవసాయ భవిష్యత్తు గురించి యువతలో దానిపై చాలా ఆసక్తి తగ్గటంపై మీ అభిప్రాయాలు మాకు నచ్చాయి. దీనికై మనమేదో ఒకటి చేయాల్సి వుంది. పల్లెసృజన పాఠకులందరూ ఎడిటర్ గారు వ్రాసిన చర్చపై తమ అభిప్రాయాలను, కార్యాచరణ మార్గాలను సూచిస్తారని, దీనిపై పల్లెసృజన పత్రిక ద్వారా మంచి చర్చ జరుగుతుందని ఆశిస్తున్నాను. ధన్యవాదములతో.....

**– సి.ఎస్. రావు,** గుడివాడ.

మీరు ప్రకటించిన ఈ సందేశానికి మా కృతజ్ఞతలు. ప్రధానమైన ఈ విషయంపై పాఠకులందరూ చర్చించాలని మేము కూడా ఆశిస్తున్నాము, పాఠకుల అభిప్రాయాలను మనసారా ఆహ్వానిస్తున్నాము.

**– ఎడిటర్.**

## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**


| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/64, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

6వ జాతీయ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞాన అవార్డు ప్రదానోత్సవం  దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగింది. రాష్ట్రపతి భవనంలోని విశాల ఉద్యానవనంలో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ గారు ఈ అవార్డులను గ్రామీణ శాస్త్రవేత్తలకు అందజేశారు. తెలుగు గడ్డనుండి జాతీయ బహుమతి పొందిన శ్రీ బోయ రాజన్న (అనంతపురం), శ్రీ నజీర్ అహమ్మద్ (మహబూబ్‌నగర్), శ్రీ భూమయ్య చారి (నిజామాబాద్), పల్లెసృజన లతో కొన్ని మధుర క్షణాలు.






# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 20/-లు మాత్రమే














పల్లెసృజన

పదిమందికి పనికివచ్చే

# పల్లెజ్ఞానం

ఒక పుస్తకం వెల రూ. 10/-లు మాత్రమే

హనీబీఏపి సేకరించిన మన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాలను ఒక పాకెట్ పుస్తకం లో పొందుపరచడమైనది. ఈ పుస్తకం కావలసిన వారు ఒక్కో పుస్తకానికి రూ. 10/-ల చొప్పున పంపి కావలసినన్ని పుస్తకాలను పొందగలరు.

## చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 600/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 1,000/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 1,500/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 2,600/- |

పల్లెసృజన చందాదారులు కండి - పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com **www.pallesrujana.org**

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, **Syndicate Bank**, **Sainikpuri**, Secunderabad.
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655